


భద్రయ్యపేటలో వైద్య సిబ్బంది సర్వే



వ్యాధిగ్రస్తులతో మాట్లాడిన డీఎంహెచ్‌ఓ - 6లో



ఏయూ కన్వెన్షన్ హాల్లో జరిగిన 'హరి హర వీరమల్లు' చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాఖ నా గుండెల్లో ఉంటుంది

నగరంతో ప్రత్యేక అనుబంధం

- ఇక్కడి భీమిలి గెస్ట్ హౌస్, సంగం, శరత్ థియేటర్ ప్రాంతాల్లో నటన నేర్చుకున్నా
- సత్యానంద్ మాస్టారు ఉత్తరాంధ్ర ఆట, పాటను అణువణువునా నా గుండెల్లో నింపారు
- 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో, ఏపీ డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విశాఖతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తాను ఇక్కడి భీమిలి గెస్ట్‌హౌస్, సంగం, శరత్ థియేటర్‌ల ప్రాంతంలో నటన నేర్చుకున్నానని నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ బుధవారం సాయంత్రం ఆర్కే బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తన పేరు పవనం అని, తిరుగుతూ ఉంటానన్నారు. 'మనం పవనాలు అయితే అవి కూపస్థ మండూకాలు. అవి బావిలో కప్పలు. అవి అలానే మాట్లాడతాయి' అంటూ ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ కొందరిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విశాఖ తన గుండెల్లో ఉంటుందని పవన్ స్పష్టం ... మిగతా 6వ పేజీలో



తనకు నటనలో ఓనమాలు నేర్పించిన సత్యానంద్ మాస్టారు కాళ్లకు నమస్కరిస్తున్న పవన్‌కల్యాణ్. చిత్రంలో హీరోయిన్ నిధి అగర్వాల్, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, నటుడు రఘుబాబు ఉన్నారు

తప్పుడు రిజిస్ట్రేషన్లకు చెక్

ఇన్నాళ్లూ కోర్టుకు వెళితేనే న్యాయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరిస్తున్న కొద్దీ మోసాలు పెరిగిపోతున్నాయి. విశాఖపట్నంలో ప్రభుత్వ రికార్డులు మార్చేసి, సర్వే నంబర్లు దిద్దేసి కోట్ల రూపాయల విలువైన భూములను కొట్టేస్తున్నారు. పక్కనున్న గెడ్డలు, చెరువులు కలిపేసుకొని లేఅవుట్లు వేసి అమ్మేసుకుంటున్నారు. విదేశాల్లో ఉన్నవారి ఆస్తులను గుర్తించి తమవే అంటూ వేరొకరికి అమ్మేస్తున్నారు. ఒకే ఆస్తిని ఇద్దరు, ముగ్గురికి విక్రయిస్తున్నారు. కోట్ల రూపాయలు పెట్టి కొన్న భూములు వేరొకరివి అని తెలిశాక కోర్టులు చుట్టూ తిరగాల్సి వస్తోంది. వీటికి ఇప్పటివరకూ అంతకు మించిన పరిష్కారం దొరకడం లేదు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో ఇలాంటివి కనీసం నాలుగైదు వరకూ వస్తున్నాయి. తమను మోసం చేశారనో, తమ భూములను ఇంకొకరు విక్రయించారనో ఫిర్యాదు చేస్తున్నారు.

- అటువంటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అధికారం ఇకపై కలెక్టర్‌కు...
- ఈ నెల 9న ప్రభుత్వం ఉత్తర్వులు
- విధి విధానాలు రావలసి ఉందంటున్న అధికారులు
- అక్రమార్కులకు ముకుతాడు



తప్పుడు రిజిస్ట్రేషన్ ద్వారా తమ ఆస్తిని వేరొకరికి అమ్మేశారని బాధితులు ఫిర్యాదు చేస్తే అది 'సివిల్ కేసు' అని కోర్టుకు వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. డాక్యుమెంట్లు అన్నీ తమ వద్దనే ఉన్నాయని, తప్పుడు రిజిస్ట్రేషన్ జరిగిందని, దానిని రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే...వారు కూడా రిజిస్ట్రేషన్లు రద్దు చేసే అధికారం తమకు లేదని, కోర్టులో కేసు వేసుకోవాలని సలహా ... మిగతా 6వ పేజీలో

విధి విధానాలు రావలసి ఉంది



తప్పుడు రిజిస్ట్రేషన్ల రద్దుపై ప్రభుత్వం గెజిట్ ఇచ్చింది. కలెక్టర్‌కు అధికారం కల్పించింది. అయితే విధి విధానాలు రావలసి ఉంది. దీనికి ఒక కమిటీ ఏర్పాటుచేస్తారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి కమిటీతో విచారణ చేయిస్తారు. సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ ఇచ్చిన నివేదికను బట్టి కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారు. రద్దు చేయాల్సిందిగా సూచిస్తే దానిని సంబంధిత కార్యాలయం రద్దు చేస్తుంది. తప్పు చేసిన వ్యక్తులపై చర్యలకు సిఫారసు చేసే అవకాశం కూడా ఉంది. దీనివల్ల తప్పుడు రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గుతుంది.

\- ఉపేంద్రరావు, జిల్లా రిజిస్ట్రార్

బిల్లెట్ల కన్వర్షన్ ప్రైవేటుపరం

ఉక్కు కర్మాగారం నిర్ణయం

- కాంట్రాక్టు దక్కించుకున్న వైజాగ్ ప్రొఫైల్స్
- రూ.210 కోట్లతో ఒప్పందం

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం ప్రైవేటీకరణ చర్యల్లో భాగంగా బిల్లెట్లను టీఎంటీ బార్లుగా కన్వర్షన్ చేసే పనిని వైజాగ్ ప్రొఫైల్స్ మాతృ సంస్థ 'స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా'కు అప్పగించింది. వాస్తవానికి టీఎంటీ బార్లను తయారుచేసే రోలింగ్ మిల్స్ స్టీల్ ప్లాంటులోను ఉన్నాయి. ఇప్పటివరకూ అక్కడే అవసరమైన సైజుల్లో టీఎంటీ బార్లను తయారు చేస్తున్నారు. కానీ ఎందుకనో ఈ పనిని బయటకు అప్పగించాలని నిర్ణయించారు. ఏడాదికి 1.2 లక్షల టన్నుల బిల్లెట్లను ... మిగతా 6వ పేజీలో

వాణిజ్య భవనాల్లో భద్రత ప్రశ్నార్థకం?

నగర శివారులో విరివిగా భారీ భవనాల నిర్మాణం

- అగ్నిమాపక శాఖ అనుమతులపై సందిగ్ధం
- సంబంధిత పరికరాల ఏర్పాటుపై కొరవడిన సమాచారం
- ఇటీవల గండిగుండం ఐటీసీ గోదాములో అగ్నిప్రమాదం
- అయినా పట్టించుకోని పంచాయతీల సిబ్బంది



గండిగుండం వద్ద ఐటీసీ గొడౌన్‌లో మంటలు (ఫైల్)

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతంలోని గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మిస్తున్న అతిపెద్ద వాణిజ్య భవనాలు, దుకాణాల్లో భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గండిగుండం నుంచి విజయనగరానికి సమీపంలోని దాకమర్రి, నీలకుండీలు నుంచి పద్మనాభం మండలం శివారు గ్రామాల వరకు అనేకచోట్ల వాణిజ్య భవనాలు, కళాశాలలు, పాఠశాలల భవనాలు, కాంప్లెక్స్‌లు నిర్మాణమయ్యాయి. ఆయా భవనాలకు అన్ని అనుమతులు ఉన్నాయా, ముఖ్యంగా అగ్నిమాపక శాఖ అనుమతి తీసుకున్నారా, సంబంధిత పరికరాలను అమర్చారా?...అనే దానిపై సందేహాలు నెలకొంటున్నాయి.

ఇటీవల ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీ రామవరం రోడ్డులోని ఐటీసీ గోదాములో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. రాత్రి సమయం కావడంతో గోదాములో సరకు మాత్రమే కాలిపోయింది. అదే పగటి పూట జరిగితే భారీగా ప్రాణ నష్టం సంభవించేదని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

శివారు ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు

జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల పరిధిలో పలు విద్యాసంస్థలు ... మిగతా 6వ పేజీలో

బాలికకు వేధింపులు...

యువకుడిపై పోక్సో కేసు

- పోలీసులు చిత్రహింసలు పెట్టినట్టు న్యాయాధికారికి నిందితుడి ఫిర్యాదు
- మర్మాంగంపై అగరువత్తితో కాల్చినట్టు ఆరోపణ
- విచారణకు ఆదేశం

మహారాణిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను వేధింపులకు గురిచేశాడనే అభియోగంపై రామకృష్ణ (25) అనే యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసి, మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్‌లోని రంగిరాజు వీధిలో నివాసం ఉంటున్న రామకృష్ణ అదే ప్రాంతానికి చెందిన ఒక బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. బాలిక తిరస్కరించడంతో ఆమె ఇంటికి వెళ్లి చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాలిక తండ్రి ఆదివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రామకృష్ణను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. హార్బర్ ... మిగతా 6వ పేజీలో

3 ఐటీ పార్కులు

మౌలిక వసతుల కల్పనకు ముందుకొచ్చిన సిఫీ, సాత్వా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలు

- ఐటీ కంపెనీలను కూడా అవే తెచ్చుకుంటాయి
- త్వరలో భూముల కేటాయింపు
- అక్టోబరు నుంచి టీసీఎస్ కార్యకలాపాలు
- నవంబరులో టీసీఎస్, కాగ్నిజెంట్ కార్యాలయాలకు భూమి పూజ
- వచ్చే నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా టాటా ఇన్నోవేషన్ హబ్, హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభం
- వచ్చే నెల 15న బంగారు కుటుంబాలకు సాయం అందించే కార్యక్రమం ప్రారంభం
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్



ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు జిల్లాలో మూడు ప్రైవేటు కంపెనీలు ఐటీ పార్కులు నెలకొల్పనున్నాయని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. పార్కులు నెలకొల్పేందుకు సిఫీ ఇన్ఫినిటీ స్పేసెస్ లిమిటెడ్, సాత్వా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ సంస్థలు ముందుకు వచ్చాయని, వారికి త్వరలో భూములు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బుధవారం తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మధురవాడ ఐటీ పార్కు, వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్‌లు, కాపులుప్పాడల్లో ఆయా సంస్థలకు భూములు కేటాయిస్తామన్నారు. ప్రతి పార్కులో ఐటీ కంపెనీల నిర్వహణకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తారని, సంస్థలు నేరుగా అక్కడకు వచ్చి కార్యకలాపాలు చేపట్టవచ్చునన్నారు. పార్కులు ఏర్పాటుచేసే సంస్థలే ఐటీ కంపెనీలను కూడా తీసుకువస్తాయన్నారు. ఐటీ కంపెనీలు రావడంతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయన్నారు. కాపులుప్పాడలో ... మిగతా 6వ పేజీలో

మాక్‌డ్రిల్‌లో అపశ్రుతి

రోడ్డుపై ఉన్న బాలికకు గాయాలు

- ఆటోనగర్ బీడీఎల్ వద్ద సంఘటన



గాయపడిన చిన్నారి మనస్వి

కూర్మన్నపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఓ సంస్థలో నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో భాగంగా పేల్చిన బాంబు నుంచి శకలం రోడ్డుపై ఉన్న బాలికకు తగలడంతో గాయమైంది. ఈ సంఘటన ఆటోనగర్ బీడీఎల్ (భారత్ డైనమిక్స్ లిమిటెడ్) సంస్థలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.

మంగళవారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించనున్నామని బందోబస్తు ఏర్పాటుచేయాలని ఆటోనగర్ బీడీఎల్ అధికారులు దువ్వాడ పోలీసులకు లేఖ రాశారు. దీంతో యాదవజగ్గరాజుపేట నుంచి ఫకీరుతఖ్యా మార్గంలో పోలీసులు ఆంక్షలు విధించారు. ఆ రహదారిలో వాహనాలను బీడీఎల్ ప్రధాన గేటుకు ఇరువైపులా కొద్దిదూరంలో నిలిపివేశారు. మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సమయంలో దువ్వాడకు చెందిన బొమ్మిడి సురేంద్రవర్మ భార్య పద్మజ, కూతురు మనస్వి (8), కుమారుడు సాకేత వర్మతో కలసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోలీసులు రోడ్డుపై నిలిపివేశారు. అదే సమయంలో సంస్థలో చేపట్టిన పేలుళ్లతో ఓ బాంబు శకలం సురేంద్రవర్మ చేతిని తాకి, అతని కుమార్తె మనస్వి కుడి బుగ్గను చీల్చుకుంటూ వెళ్లిపోయింది. పాపను హుటాహుటిన దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ ఘటనలో పాపకు రక్తం కారుతుండడంతో అక్కడ విధుల్లో ఉన్న పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై బుధవారం ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు సమాచారం ఇచ్చారు. ఆయన ఆస్పత్రిలో ... మిగతా 6వ పేజీలో

ఏయూలో విద్యార్థుల ఆందోళన

హాస్టళ్లు, క్యాంపస్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీసీ కార్యాలయం ఎదుట బైఠాయింపు

- నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించేలా చర్యలు చేపడతామన్న వైస్ చాన్సలర్
- టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడి
- మెస్‌ల నిర్వహణకు స్టూడెంట్ కమిటీలు

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు బుధవారం ఉదయం ఆందోళనకు దిగారు. ఆహారంలో పురుగులు ఉన్నాయంటూ మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో హాస్టల్ విద్యార్థులు వర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట ... మిగతా 6వ పేజీలో



విద్యార్థులతో మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ బి.పి.రాజశేఖర్



సాగర్‌నగర్ తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

అల్లకల్లోలంగా తీరం

సాగర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) :సాగర్‌నగర్, రుషికొండ తీర ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడనుండడంతో మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. సాగర్‌నగర్, రుషికొండ తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. సాధారణ స్థాయి కంటే ఎక్కువ ఎత్తులో కెరటాలు ఎగసి పడుతూ ఇసుక తెన్నులను ముంచెత్తుతున్నాయి.బీచ్ రోడ్డులో ప్రయాణించే వారు కెరటాలు ఉధృతిని చూసి ఆందోళన చెందుతున్నారు. రెండు మూడు రోజుల పాటు కెరటాలు ఇదే స్థాయిలో ఉండే అవకాశం ఉండడంతో సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని లైఫ్‌గార్డులు సూచించారు.

సంప్రదాయబద్ధంగా సుదర్శన హవనం



హవనంలో పాల్గొన్న లక్ష్మీకాంత్ నాయకో దాసుడు

సింహాచలం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలోని బరంపురం జిల్లా పట్టుపురం గ్రామానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకోదాసుడు సతీసమేతంగా, బంధు, శిష్య పరివారంతో కలిసి సుదర్శన హవనం సంప్రదాయబద్ధంగా జరిపించారు. బుధవారం ఉదయం పంచాంగం ప్రకారం ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో సింహగిరిపై గంగధారకు సమీపంలో ఉన్న దాసుడి బసలో శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ముందుగా సిద్ధం చేసిన హోమకుండంలో అగ్నిప్రతిష్టాపన చేసి నారసింహ, సుదర్శన మూల, మూర్తి మంత్రాల పఠనంతో హవనాన్ని నిర్వహించారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 1.5 లక్షల విరాళం

సింహాచలం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని సిరిపురం ప్రాంతానికి చెందిన ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగుల క్లబ్ రూ.1.5 లక్షల విరాళం సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో దేవాలయం ఏఈఓ తిరుమలేశ్వరరావుకు బుధవారం వారు అందజేశారు. దాతలకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పోరాటంతోనే హక్కుల సాధన : ఐద్వా

కొమ్మాది, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : హక్కుల సాధనకు మహిళలు ఐక్యమత్యంగా ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వై. సత్యవతి పిలుపునిచ్చారు. బుధవారం కొమ్మాదిలోని త్రిశక్తి దేవాలయం కల్యాణ మండపంలో ఐద్వా మద్దిలపాలెం జోన్ 5వ మహాసభ జరిగింది. తొలుత కెప్టెన్ లక్ష్మీ సెహెగల్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి సత్యవతి మాట్లాడుతూ మహిళల రక్షణే ప్రధాన ధ్యేయమని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను నేరస్తులకు చుట్టాలుగా మారుస్తున్నాయని మండిపడ్డారు. డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీకే రుణాలు ఇస్తామని చెప్పి వాటిని తుంగలో తొక్కుతున్నాయన్నారు. శ్రామిక మహిళలపై పని భారం పెంచడం, రాత్రి సమయంలో కూడా వారితో పనులు చేయిస్తే రక్షణ ఎక్కడి ఉంటుందని ప్రశ్నించారు. అనంతరం మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ ప్రాంతాల్లో వేర్వేరుగా ఉన్న మూడు కమిటీలను మద్దిలపాలెం జోన్‌గా కమిటీగా నిర్ణయించి, ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకులు ఎం. మౌనిక, కె. సుజాత, నూర్జహాన్ బేగం, శారద, తదితరులు పాల్గొన్నారు.

3 ఐటీ పార్కులు

... 5వ పేజీ తరువాయి

రహేజా సంస్థ కూడా మౌలిక వసతుల కల్పనకు సంసిద్ధత వ్యక్తంచేసిందన్నారు. టీసీఎస్ సంస్థ రుషికొండ ఐటీ హిల్స్‌లో కేటాయించిన భవనంలో వసతులు సమకూర్చుకుంటుం దన్నారు. ఏపీఐఐసీ ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తోందన్నారు. బహుశా ఈ ఏడాది అక్టోబరు నుంచి టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. నవంబరులో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సులో టీసీఎస్, కాగ్నిజెంట్, మరికొన్ని ఐటీ కంపెనీలకు కేటాయించిన భూముల్లో భూమి పూజ చేయనున్నాయని తెలిపారు. ఈ ఏడాది చివరికల్లా పలు కంపెనీలు విశాఖ నుంచి ఆపరేషన్స్ ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఐటీ కంపెనీల కోసం సుమారు 200 ఎకరాలు సిద్ధంగా ఉంచామన్నారు. ఆర్కే బీచ్‌రోడ్డు సమీపాన లులూ గ్రూపు నెలకొల్పనున్న షాపింగ్ మాల్ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నగరానికి రానున్నారని, ఈ సందర్భంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్, బీచ్‌రోడ్డులో వీఎంఆర్‌డీఏ ఏర్పాటుచేసిన హెలికాప్టర్ మ్యూజియం, ఇతర ప్రాజెక్టులను ప్రారంభిస్తారన్నారు. జిల్లాలో పీ-4లో భాగంగా గుర్తించిన 73 వేల బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం చేసే ప్రక్రియ వేగంగా జరుగుతుందన్నారు. ఇప్పటివరకూ 26 వేల కుటుంబాల కోసం 2600 మంది మార్గదర్శకుల ఎంపిక పూర్తయిందన్నారు. బంగారు కుటుంబాలకు ఎటువంటి సాయం కావాలనే దానిపై రూట్స్ అనే యాప్ ద్వారా సర్వే జరుగుతుందన్నారు. ఎవరికి ఎటువంటి సాయం కావాలి?...అనేది సర్వేలో తేలిన తరువాత ఆయా కుటుంబాలకు చేయూత అందించే ప్రక్రియ మొదలవుతుందన్నారు. వచ్చే నెల 15వ తేదీన బంగారు కుటుంబాలకు సాయం అందించే కార్యక్రమం ప్రారంభించాలని యోచిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కేజీహెచ్‌లో సీఎస్సార్ నిధులతో చేపట్టిన పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండేలా ఆదేశాలు ఇస్తామన్నారు.

మాక్‌డ్రిల్‌లో అపశ్రుతి

... 5వ పేజీ తరువాయి

చికిత్స పొందుతున్న చిన్నారిని పరామర్శించారు. పోలీసుల వ్యవహారశైలిపై మండిపడ్డారు. చిన్నారికి గాయమైనా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అంశాన్ని కలెక్టర్, సీపీ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. బీడీఎల్ అధికారులపై కేసు నమోదు చేయకపోవడం సరికాదన్నారు. చిన్నారి చికిత్స బాధ్యతను ఎవరు వహిస్తారని ఎస్‌ఐ శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. ఈ ఘటన గురించి దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా, బాంబులు పేల్చిన సమయంలో బందోబస్తులోని సిబ్బందికి, మాక్‌డ్రిల్‌లో ఉన్న కమెండోలకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. ఆ సమయంలో పలువురు ద్విచక్ర వాహనదారులు గేటు బయట రోడ్డుపై ఉన్నా ఎవరికీ గాయాలవ్వలేదని, ఘటనకు సంబంధించి సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించామన్నారు. దీనిపై ఎవరిపైనా కేసు నమోదు చేయలేదని వివరించారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా రామలక్ష్మి

తగరపువలస, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసకు చెందిన సీరపు రామలక్ష్మి బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

భద్రయ్యపేటలో వైద్య సిబ్బంది సర్వే

- వ్యాధిగ్రస్తులతో మాట్లాడిన డీఎంహెచ్‌ఓ
- ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కిడ్నీ వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పద్మనాభం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేట గ్రామాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 'మంచంపట్టిన భద్రయ్యపేట' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. గ్రామాన్ని సందర్శించి, వైద్య సిబ్బందితో ఇంటింటి సర్వే చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధితో ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. వ్యాధి ప్రబలడానికి గల కారణాలను పరిశీలించడంతో పాటు మెడికల్ కళాశాలకు కూడా నివేదిస్తామన్నారు. రోగులకు అవసరమైన వైద్య సదుపాయం అందిస్తామని చెప్పారు. గ్రామస్తులందరికీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వ్యాధిగ్రస్తులను పరిశీలించి, వారితో మాట్లాడారు. కాగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి రాత్రి వరకు సర్వే చేశారు.వ్యాధి బారిన పడిన వారి ఆరోగ్య పరిస్థితి, బీపీ, షుగర్, సీఎస్ కేర్, తదితర వాటిని పరిశీలించారు. వయస్సు పైబడిన వారు ఈ వ్యాధితో తీవ్రంగా బాధపడుతున్నట్టు గుర్తించారు. ఒకే ఇంట్లో భార్య, భర్త కూడా వ్యాధి బారిన పడినట్టు తెలిపారు. గ్రామాన్ని సందర్శించిన వారిలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం పీఓ ఉమావతి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు ఉన్నారు. కాగా కిడ్నీ బాధితులకు కేజీహెచ్‌లో బుధవారం పరీక్షలు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఆదేశాల మేరకు నెఫ్రాలజీ విభాగం వైద్యులు 47 మందికి పరీక్షలు చేసి, 8 మందికి క్రియాటివిటీ లెవెల్ పెరిగిందని తెలిపారు. మిగిలిన వారికి కూడా పరీక్షలు నిర్వహించిన అనంతరం ఫలితాల మేరకు వైద్య సదుపాయం కల్పిస్తామని నెఫ్రాలజీ విభాగం ఇన్‌ఛార్జి ప్రొఫెసర్ రాధాకృష్ణ తెలిపారు. కాగా కిడ్నీ రోగులకు బీజేపీ వైద్య విభాగం ఏపీ కన్వీనరు రూపాకుల రవికుమార్, సీనియర్ నాయకులు ప్రకాష్‌రెడ్డి బాసటగా నిలిచి సహాయ సహకారాలు అందించారు.

మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న పీఆర్‌ఎస్‌ఎన్ నాయుడు


ఆనందపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధి మార్గాలను కల్పించుకోవాలని సత్య సాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎన్ నాయుడు అన్నారు. బుధవారం చందక గ్రామంలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామన్నారు. జిల్లా మహిళా సేవాదళ్ కో-ఆర్డినేటర్ కేఎస్‌వీ ఈశ్వరి మాట్లాడు తూ మహిళలు ఇటువంటి శిక్షణల ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని చెప్పారు. 40 మంది మహిళలకు 40 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ సత్యన్నారాయణ, గ్రామ సేవలు ఇన్‌చార్జి అప్పారావు, గొట్టిపల్లి భజన మండలి కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రావణ మాసోత్సవాలు

భీమునిపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెంకటగిరిపై ఉన్న పద్మావతి, గోదాదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి వచ్చేనెల 23వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు తెలిపారు. 25న మొదటి శుక్రవారం సందర్భంగా పాలాభిషేకం, కుంకుమార్చన జరుతుందన్నారు. 1న సహస్ర కుంకుమార్చన, 8న అమ్మవారిని ధనలక్ష్మి అవతారంలో అలంకరించి సహస్ర కుంకుమార్చన జరుపుతామన్నారు.9న శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు, 15న సామూహిక కుంకుమార్చన, 22న సహస్ర కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం/ఎండాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ అప్పలనాయుడు తెలిపారు.మెట్టమీదపాలెం, పాలవలస, పొడుగుపాలెం, చందక, వెంకటాపురం, జగన్నాథపురం, గొట్టిపల్లి, కుసులువాడ, చీమలమెట్టపాలెం గ్రామాలకు సరఫరా ఉండదని చెప్పారు. అలాగే ఎండాడ పెట్రోల్ బంకు వెనుక భాగం, వీవీ నగర్, శిరుగుడినగర్, తాటిచెట్లపాలెం, దసపల్లా లేఅవుట్, ఎండాడ ఎస్సీ, బీసీ కాలనీ, ఎండాడ రిజర్వాయర్ ఏరియా ప్రాంతాలకు సరఫరా ఉండదని ఏఈ చెప్పారు.



సుత్తమ్మ తల్లికి పండ్లతో అలంకరణ

భీమునిపట్నం (రూరల్), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ గ్రామంలో ఉన్న సుత్తమ్మ తల్లికి ఆషాడ మాసం సందర్భంగా బుధవారం సారె సమర్పించారు. 14 గ్రామాలకు చెందిన మహిళలు వివిధ రకాల పిండి వంటలు తయారు చేసి, ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని పండ్లతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.

పడిపోతున్న వీధి లైట్లు

సాగర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జీ 20 సదస్సుల సుందరీకరణ పనుల్లో భాగంగా సాగర్‌నగర్ బీచ్ లో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీధి లైట్లు నేలరాలుతున్నాయి. బుధవారం బీచ్‌లో ఉన్న ఒకలైటు నేలపై పడింది. ఆ సమయంలో అక్కడ సందర్శకులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బీచ్‌లో ఏర్పాటు చేసిన స్తంభాలకు చాలా లైట్లు ఇదే రీతిన ఉన్నాయి.

ఎస్సీ కాలనీలో 'తొలి అడుగు'

కొమ్మాది,జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు అని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు అన్నారు. బుధవారం కొమ్మాదిలోని ఎస్సీ కాలనీలో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లొడగల జానకీ రామ్, భరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బిల్లెట్ల కన్వర్షన్ ప్రైవేటుపరం

... 5వ పేజీ తరువాయి

స్టీల్ ప్లాంటు సరఫరా చేస్తే వాటిని కొత్తవలసలో గల స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా రోలింగ్ మిల్స్‌లో 'వైజాగ్ టీఎంటీ బార్లగా తయారుచేసి వెనక్కి ఇస్తుంది. వాటిని స్టీల్ ప్లాంటు మార్కెట్‌లో విక్రయిస్తుంది. ఇందుకుగాను ఏడాదికి రూ.70 కోట్లు వరకు స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియాకు చెల్లించడానికి స్టీల్ ప్లాంటు అంగీకరించింది. రెండేళ్లకు ఒప్పందం చేసుకున్నారు. ఇంకో ఏడాది ఒప్పందం పెంచుకునే అవకాశం ఉంది. ఈవిధంగా మొత్తం 210 కోట్ల విలువైన పని వైజాగ్ ప్రొఫైల్స్‌కు దక్కింది.

మంగమారిపేటను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు



మత్స్యకారులతో ట్రైనీ ఐపీఎస్‌లు, మెరైన్ పోలీసులు

భీమునిపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్‌లో ఉన్న మంగమారిపేట మత్స్యకార గ్రామాన్ని ట్రైనీ ఐపీఎస్‌ల బృందం బుధవారం సందర్శించింది. రుషికొండ మెరైన్ పోలీసుస్టేషన్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ బృందం మంగమారిపేట తీరాన్ని సందర్శించి, మత్స్యకారులతో కమ్యూనిటీ భవనంలో సమావేశమయ్యారు. మత్స్యకారుల జీవన విధానం, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, తీర రక్షణలో వారి పాత్రను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రుషికొండ మెరైన్ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గేటెడ్ కమ్యూనిటీల్లో లాకర్ల ఏర్పాటు

ఎండాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గేటెడ్ కమ్యూనిటీల్లో లాకర్లు ఏర్పాటు చేయనున్నట్టు అర్క్ సంస్థ సీఈఓ విజయ్ అరిసెట్టి తెలిపారు. బుధవారం ఆయన ఎండాడలోని స్కై పార్కు ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్యధిక భద్రతతో విలువైన వస్తువులను సురక్షితంగా ఉంచుతామని చెప్పారు. ఇప్పటికే ఎండాడ ఎంకే, స్కై పార్కు, వాల్తేరు క్లబ్‌లో తమ సేవలు అందిస్తున్నామని, ఈ ఏడాదే ప్రారంభమైన తమ సంస్థ నగరంలో రెండు వేల లాకర్లు ఏర్పాటు చేసిందన్నారు. ఈఏడాది చివరికి మరో ఐదు వేల లాకర్లు అందుబాటులోకి తీసుకురానున్నట్టు పేర్కొన్నారు. విశాఖ, బెంగళూరు. హైదరాబాద్ నగరాల్లో లాకర్ల వ్యాపారాన్ని విస్తృతం చేస్తున్నామని చెప్పారు. అత్యాధునిక సాంకేతికతో, రూ. కోటి ఇన్సూరెన్స్ కవరేజ్‌తో మొబైల్ యాప్ ద్వారా లాకర్‌ను వినియోగించుకునేలా రూపొందించినట్టు చెప్పారు. స్మాల్, లార్జ్, ఎక్స్‌ట్రా లార్జ్ విభాగాలుగా లాకర్లు ఏర్పాటు చేసి, ఏడాదికి రూ. 10 వేలు నుంచి రూ. 25 వేలు వరకు చార్జ్ చేస్తున్నట్టు వివరించారు.

ఏయూలో విద్యార్థుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

బైఠాయించారు. తెల్లవారుజాము వరకూ నిరసన కొనసాగించారు. బుధవారం ఉదయం హాస్టళ్లు, తరగతి గదుల వద్దకు వెళ్లి మరింత మంది విద్యార్థులను కూడగట్టారు. అనంతరం ర్యాలీగా వైస్ చాన్సలర్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. అధికారుల నిరంకుశ వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. భోజనంలో పురుగులు వస్తున్నా, విద్యార్థులు సమస్యలతో అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో వైస్ చాన్సలర్ స్వయంగా సమస్యలు చెప్పాలంటూ విద్యార్థుల మధ్యకు వెళ్లి కూర్చున్నారు. నాణ్యమైన భోజనం పెట్టాలని, వసతి గృహాల్లో బెడ్స్ ఏర్పాటు చేయాలని, క్యాంపస్‌లో వై-ఫై సదుపాయం కల్పించాలని, మహిళల వసతి గృహాల్లోకి పాములు, పురుగులు రాకుండా మెష్‌లు ఏర్పాటుచేయాలని కోరారు. విద్యార్థుల డిమాండ్‌లపై వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ వర్సిటీలోని సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. కొన్ని హాస్టళ్లలోని మెస్‌లలో డైనింగ్, ఇతర పనులు చేశామని, మిగిలిన వాటిల్లో కూడా పూర్తి చేస్తామన్నారు. నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించేలా చర్యలు చేపడతామని, ఇందు కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. మెస్ నిర్వహణకు స్టూడెంట్ కమిటీలు ఏర్పాటుచేస్తామని, ఇందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. ఆయా సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తామన్న దానిపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు విద్యార్థులతో చర్చలు జరిపారు. నెలరోజుల్లో మెజారిటీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విద్యార్థులు తమ ఆందోళనను విరమించారు.

అంకితభావంతో విధులు నిర్వహించండి

- ప్రొబేషనరీ ఎస్‌ఐలకు డీఐజీ గోపినాథ్‌జట్టి సూచన



ప్రొబేషనరీ ఎస్‌ఐలతో డీఐజీ గోపినాథ్ జట్టీ

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : అంకిత భావంతో విధులు నిర్వహించాలని ప్రొబేషనరీ ఎస్‌ఐలకు విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్‌జట్టీ సూచించారు. ప్రాథమిక శిక్షణ పూర్తిచేసుకున్న 49 మంది (33 మంది పురుషులు, 16 మంది మహిళలు) ప్రొబేషనరీ ఎస్‌ఐలు బుధవారం నగరంలోని రేంజ్ కార్యాలయంలో డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీ, సేవాతత్పరత ముఖ్యమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేయాలన్నారు. నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాన్నారు. ప్రొబేషనరీ సమయంలో సీనియర్లు, సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు ఏర్పరచుకోవాలని డీఐజీ సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు మహేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, వకుల్ జిందాల్, అమిత్‌బర్దార్‌లు ప్రొబేషనరీ ఎస్‌ఐలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రొబేషనరీ ఎస్‌ఐలు తమకు కేటాయించిన జిల్లాల్లో ఐదు నెలలపాటు ప్రాక్టికల్ ట్రైనింగ్ తీసుకోనున్నారు. శిక్షణ కోసం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు పది మంది చొప్పున, విజయనగరం జిల్లాకు 9 మందిని కేటాయించారు.

యువకుడిపై పోక్సో కేసు

... 5వ పేజీ తరువాయి

ఏసీపీ కాళిదాసు సోమవారం పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం మంగళవారం న్యాయాధికారి వద్ద హాజరుపరిచారు. అయితే ఆదివారం తనను స్టేషన్‌లో ఉంచినప్పుడు సీఐ దాలిబాబు ఆదేశాల మేరకు ఎస్‌ఐ శ్రీను, రైటర్ సంతోష్ కలిసి తనను చిత్రహింసలకు గురిచేశారని, మర్మాంగంపై అగరవత్తితో కాల్చడంతో తీవ్రగాయాలయ్యాయని న్యాయాధికారికి నిందితుడు రామకృష్ణ ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో నిందితుడికి రిమాండ్ విధించిన మెజిస్ట్రేట్...ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీ శంఖబ్రతబాగ్చీని ఆదేశించినట్టు సమాచారం. మెజిస్ట్రేట్ ఆదేశాలతో సీపీ శంఖబ్రతబాగ్చి దీనిపై హార్బర్ ఏసీపీని వివరణ కోరారు. తాను నిందితుడిని సోమవారం అరెస్టు చేశానని, నిందితుడి మర్మాంగంపై గాయపరిచిన ఘటన ఆదివారం జరిగిందని, సోమవారం తనకు ఆ విషయాన్ని స్టేషన్ సిబ్బందిగానీ, నిందితుడుగానీ చెప్పలేదని వివరణ ఇచ్చినట్టు సమాచారం. నిందితుడిని స్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేసిన విషయం బయటకు పొక్కడంతో సీపీ ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

తప్పుడు రిజిస్ట్రేషన్లకు చెక్

... 5వ పేజీ తరువాయి

ఇస్తున్నారు. కోర్టుకు వెళితే కేసులు ఒకంతట తేలడం లేదు. దశాబ్దాలు గడిచిపోతున్నాయి. దీంతో ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏదైనా రిజిస్ట్రేషన్ తప్పుగా చేశారని, అందులో మోసం జరిగిందని తేలితే ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9వ తేదీన 267, 268 గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించింది. అంటే కోర్టుల చుట్టూ తిరగాల్సిన పని లేదు. తప్పు జరిగిందని నిర్ధారణ అయితే చాలు...కలెక్టర్ దానిని రద్దు చేయొచ్చు. అయితే ఈ ప్రక్రియకు సంబంధించి ఇంకా విధి విధానాలు రావలసి ఉంది. ఇప్పటివకూ ప్రభుత్వ భూములను ఎవరికైనా రిజిస్టర్ చేసినట్టు తెలిస్తే కలెక్టర్ ఆర్డర్ ద్వారా వాటిని సబ్ రిజిస్ట్రార్లు రద్దు చేస్తున్నారు. జిరాయితీ భూముల మోసాలకు సంబంధించి కోర్టు ఆదేశాలనే పాటిస్తున్నారు. లేదంటే కొన్నవారు, అమ్మినవారు ఇద్దరూ వచ్చి తమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరితే...అప్పుడు చేయగలుగుతున్నారు. ఇకపై తప్పు అని తేలితే దానిని కలెక్టర్ రద్దు చేయొచ్చు. దీనివల్ల సమస్యకు త్వరగా పరిష్కారం లభిస్తుంది.

విశాఖ నా గుండెల్లో ఉంటుంది



కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, బండారు, పంచకర్ల, సుందరపు, వంశీకృష్ణ, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాస్

... 5వ పేజీ తరువాయి



హీరోయిన్ నిధి అగర్వాల్

చేశారు. 'బైబైయ్యే బంగారు రమణమ్మా'..., 'లబోలబో లబరి గాజులు'... పాటలు పాడిన పవన్ కల్యాణ్...తనకు నటనలో ఓన మాలు నేర్పిన సత్యానంద్ మా స్టారు ఉత్తరాంధ్ర, ఆట, పాట గుండెల్లో అణువణువూ నింపేశార న్నారు. సినిమాల గురించి చెప్పా లంటే తనకు సిగ్గు అన్నారు. అయితే జోలీ మోతలతో ఇబ్బం ది పడే గ్రామాలకు రోడ్లు వేయించ గలనని, తనను తిట్టే ప్రత్యర్థి పార్టీల సర్పంచులకు అడగకుండా నిధులు మంజూరు చేయగలనన్నారు. తనకు ఇవ్వ డమే తప్ప అడగడం తెలియదన్నారు.సినిమాను ప్రేమించడం మాత్రమే తనకు తెలుసునన్నారు. తాను జీవితంలో ఒక స్థాయికి చేరుకునేందుకు అన్నయ్య, వదిన ఎంతగానో కృషి చేశారని, అందుకే గెలిచిన తరువాత వారి పాదాల వద్ద తన శిరస్సును పెట్టాన న్నారు. తనకు అతిపెద్ద హిట్ ఇవ్వాలన్న ఉద్దేశంతో రత్నం ఒక కథను చెప్పారన్నారు. ఈ సినిమాను 40 శాతం క్రిష్ డైరెక్ట్ చేశారని, కొన్ని కారణాల వల్ల ఆయన ప్రాజెక్టు నుంచి పక్కకు వెళ్లిపోయినప్పటికీ జ్యోతి అద్భుతంగా డైరెక్ట్ చేశారన్నారు. తక్కువ సమయంలో ఎఫెక్టివ్‌గా సినిమాను తీసినట్టు వెల్లడిం చారు. కోహినూర్ వజ్రాన్ని తీసుకువచ్చే క్రమంలో ఎదురయ్యే అనుభవాలు వంటివన్నీ ఆసక్తికరంగా చిత్రీకరించినట్టు తెలిపారు.

వాణిజ్య భవనాల్లో భద్రత ప్రశ్నార్థకం?

... 5వ పేజీ తరువాయి

వాణిజ్య సముదాయాలు, భారీ భవనాలు, గోడౌన్లు నిర్మితమయ్యాయి. వాణిజ్య అవసరాల కోసం నిర్మించే ప్రతి భవనానికీ అగ్నిమాపక శాఖ అనుమతి తప్పనిసరి. అయితే గ్రామీణ ప్రాంతంలో ఎన్ని భవనాలకు ఈ అనుమతులున్నాయనే దానిపై సమాచారం కొరవడు తోంది. నగరంలో భారీ భవనాలు నిర్మించదలిస్తే పలు శాఖల అనుమతులు ఉంటేనే పట్టణ ప్రణాళికా విభాగం ప్లాన్‌ను ఆమోదించే అవకాశం ఉంటుంది. అయితే గ్రామీణ ప్రాంతంలో భారీ నిర్మాణాలకు అనుమతుల విషయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్న దాఖలాలు కనిపించడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సర్పంచులు లేదా అధికారపార్టీ నేతల మాట కాదనే పరిస్థితి లేకపోవడంతో వారు మిన్నకుంటున్నారనే వాదన ఉంది. ఈ నేపథ్యంలో భారీ భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, పన్నులు విధించడంలో సర్పంచుల మాటే చెల్లుబాటవుతోందని చెబుతున్నారు.

సమాచారంపై సందిగ్ధం

ఆనందపురం మండల పరిసరాల్లో పలు విద్యాసంస్థలు పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. కొందరు భూ యజమానులు ఆయా విద్యాసంస్థల కోసం భారీ భవనాలు నిర్మించి అందజేస్తున్నారు. వీటికి అగ్నిమాపక శాఖ అనుమతులు తీసుకున్నారా లేదా అనే దానిపై పంచాయతీ కార్యదర్శుల వద్దే సరైన సమాచారం లేదు. పెద్ద గోదాములు, భవనాలకు వీఎంఆర్‌డీఏ అనుమతులు ఇస్తోందని, అయినా పంచాయతీ కార్యదర్శులు పన్నులు విధించే సమయంలో అన్ని పత్రాలూ ఉన్నాయో లేదో చూడాల్సిన బాధ్యత ఉందని పంచాయతీ రిటైర్డు అధికారి ఒకరు తెలిపారు.

విద్యా సంస్థల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. గండిగుండం ఐటీసీ గోదాములో సంభవించిన అగ్ని ప్రమాదాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రామీణ ప్రాంతంలోని వాణిజ్య భవనాలు, సముదాయాలు, విద్యాసంస్థల భవనాలకు అగ్నిమాపక శాఖ అనుమతులున్నాయా, ప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ ఫైటింగ్ సామగ్రి అందుబాటులో ఉంచారా?, లేదా?... అనేది పంచాయతీ అధికారులు తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు.

సమయపాలన తప్పనిసరి

» జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులకు స్పష్టం చేసిన కమిషనర్ కేతన్ గార్గ్ » ప్రజారోగ్య విభాగంలో ఆకస్మిక తనిఖీ



బర్త్, డెత్ ధ్రువపత్రాల పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకుంటున్న జీవీఎంసీ కమిషనర్

వెంకోజీపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు కార్యాలయ పనివేళల సమయానికి తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ప్రజారోగ్య విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ అన్ని విభాగాల్లో పనివేళల్లో నిర్ణీత సమయానికి అధికారులు, ఉద్యోగులందరూ విధుల్లో ఉండాలని ఆదేశించారు. తదుపరి జీవీఎంసీ స్టాటిస్టికల్ అధికారి పీవీడీ ప్రసాదరావు చాంబర్‌లో బర్త్ అండ్ డెత్ వివరాలు, నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ పరిధిలో ఎన్ని హాస్పిటల్స్ నమోదు అయి ఉన్నాయని ఆరా తీయగా, 238 హాస్పిటల్ రిజిస్ట్రేషన్ అయ్యాయని స్టాటిస్టికల్ అధికారి తెలియజేశారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు ప్రస్తుతం ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు సంబంధిత అర్జీల మేరకు వెనువెంటనే జారీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరంలో జీవీఎంసీ రిజిస్ట్రేషన్ అవ్వని బర్త్ అండ్ డెత్ నమోదులు జరిగే క్లినిక్‌లు, ఆసుపత్రులు ఏమైనా ఉంటే సీఆర్ఎస్ పోర్టల్ ద్వారా నమోదు అయ్యేలా చూడాలని చెప్పారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియలో నమోదు చేసే సంబంధిత అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత సమయంలో దరఖాస్తుదారులకు అందేలా ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎస్వీ నరేష్‌కుమార్‌ను కమిషనర్ సూచించారు.

జీవీఎంసీ ఆదాయ పరిపుష్టికి కార్యాచరణ

» రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లకు గ్రేటర్ విశాఖ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం » జడ్సీలతో వీడియో కాన్ఫరెన్స్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్



పాల్గొన్న అధికారులు

వెంకోజీపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరాభివృద్ధికి జీవీఎంసీ చేపడుతున్న ఆదాయ వనరుల్లో భాగంగా జీవీఎంసీ ఆదాయ పరిపుష్టికి కార్యాచరణ చేపట్టాలని, అవసరమైన మార్గాలను అన్వేషించి జీవీఎంసీ ఆదాయాభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత జీవీఎంసీ రెవెన్యూ అధికారులపై ఉందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నగరాభివృద్ధి దిశగా జీవీఎంసీ చేపడుతున్న పలు అభివృద్ధి కార్యాచరణలో భాగంగా జీవీఎంసీకి ఆదాయాన్ని పెంచి జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టికి జోనల్ కమిషనర్లు, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు, తాగునీరు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లు, హాస్పిటల్స్ తదితర పన్నులతో పాటు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి పన్నులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వసూలు చేయాలన్నారు. ఆస్తి, ఖాళీ స్థలాలు, షాపు రూములు, వాణిజ్య సముదాయాలు, మార్కెట్లు తదితర పన్నులు ఏ విధంగా వేస్తారని రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3వ జోన్ 33 శాతం అధికంగా ఆస్తిపన్ను వసూలు చేసిందని, గాజువాక జోన్ అత్యల్పంగా 5 శాతం ఆస్తి పన్ను వసూలు చేసిందని తెలిపారు. అన్ని జోనల్ పరిధిలో ఆగస్టు 31 నాటికి 50 శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్తిపన్ను వసూలుకు సంబంధించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జోనల్ కమిషనర్లు వారంలో ఒక రోజు రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో రెవెన్యూపై సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. వార్డు కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు వార్డులో కొత్త, పాత బిల్డింగ్ కొలతలు సరిచూడాలని, అలాగే తాగునీటి కనెక్షన్ ఉంటే వారు ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను చార్జీలు చెల్లిస్తున్నదీ, లేనిది గమనించాలన్నారు. ఆస్తి పన్ను వసూలు చేసే కేంద్రాలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోనూ, ప్రతి జోన్‌లోను ఒక్కొక్కటి ఉన్నందున జోన్‌కు దూరంగా ఉన్న ప్రాంతాల వారు ఆన్‌లైన్లో ఆస్తి పన్నులు చెల్లిస్తున్నందున కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిని సరి చేసేందుకు ప్రతి వార్డులో ప్రజలకు దగ్గరగా ఉన్న వార్డు సచివాలయాన్ని ఎంపిక చేసి ఆస్తి పన్ను వసూలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లకు సూచించారు. ప్రభుత్వ ఆస్తి పన్ను, కోర్టు కేసులు ఉన్న వాటి ఆస్తి పన్ను వసూలుకు రూల్ బుక్ ప్రకారం వెళ్లి వసూలు చేయాలని, కోర్టులో కేసు ఉందని ఆస్తి పన్ను వసూలు చేయకూడదన్న నియమమేమీ ఉండదని, కేసు పూర్వపలాలు ప్రతి రెవెన్యూ అధికారి క్షుణ్ణంగా తెలుసుకుని అవగాహనతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్రతి రెవెన్యూ అధికారి ఆస్తి పన్ను వసూలుకు సంబంధించి అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకుని అవగాహన కలిగి ఉండాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఎంవీపీ కాలనీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ ఫీడర్‌పై నిర్వహణ పనుల నిమిత్తం 25 (శుక్రవారం)న ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకూ విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వెంకోజీపాలెం పెట్రోల్ బంకు నుంచి కరాచీ బేకరి, కేఎఫ్‌సీ, మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి వరకూ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

27న కళాభారతిలో రుక్మిణీ కల్యాణం

మద్దిలపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పీఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఈనెల 27న రుక్మిణి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు త్యాగరాజ ఆరాధన ట్రస్టు కార్యదర్శి గుమ్మలూరి రాంబాబు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ ఉత్సవం జరుగుతుందన్నారు. కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. ఈ కల్యాణం మహిమతో యువతీయువకులు వివాహం జరుగుతుందని, సంతానం లేని వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. కాబట్టి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

దబ్బంద టిడ్కో ఇళ్ల రుణాలు మాఫీ చేయాలి

» సీపీఐ ఆధ్వర్యంలో నిరసన » ఎమ్మెల్యేలు గంటా, వెలగపూడికి వినతిపత్రాలు



టిడ్కో ఇళ్ల నివాసితులతో మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఎంవీపీ కాలనీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : దబ్బందలోని టిడ్కో నివాసాలపై ఉన్న బ్యాంకు రుణాలను రద్దుచేసి, ఆ ప్రాంతంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో టిడ్కో వెల్ఫేర్ సొసైటీ బుధవారం ఎంవీపీలోని భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కూడా కలసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావుకు సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ దబ్బంద నివాసులు సమస్యలను విన్నవించారు.



తూర్పు ఎమ్మెల్యే వెలగపూడితో గోడు వెళ్లబోసుకుంటున్న నివాసితులు

దీనిపైస్పందించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దబ్బందలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, జీవీఎంసీ కమిషనర్, ఇతర అధికారులను క్షేత్రపర్యటనకు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. తమ సమస్యలను జీవీఎంసీ అధికారుల దృష్టిలో పెట్టాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కూడా నివాసులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరరావు, శ్రీనివాస్, శ్రీనివాసరావు, జయశ్రీ, నూకరత్నం, దివ్య, సత్యనారాయణ, చంద్రశేఖర్, మన్మథరావు, నాగభూషణ్, దేవుడమ్మ, కాసుబాబు, లక్ష్మణరావు, పుష్పలత, సందీప్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారుడికి వీఎంఆర్డీఏ చైర్మన్ ఆర్థిక సహాయం



ఫరీద్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన షేక్ ఫరీద్‌కు వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ బుధవారం ఆయన కార్యాలయంలో అభినందించి ఆర్థికసాయం అందజేశారు. ఆగస్టు 6 నుంచి 13 వరకు ఉత్తరప్రదేశ్‌లోని నొయిడాలో నిర్వహించిన జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు విశాఖ నుంచి ఫరీద్ ఎంపికయ్యారు. పోటీలకు రాకపోకలు, ఇతర ఖర్చుల నిమిత్తం ప్రణవ్ గోపాల్ రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి విశాఖకు పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాగా, ఫరీద్ తండ్రి, విశాఖ పార్లమెంట్ టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 44, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 20, పచ్చిమిర్చి 74, కాకరకాయలు 32, బీరకాయలు 26, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 44,దొండకాయలు 22, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 52, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 45, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 30, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 46, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

భానునగర్ ప్రాంతాన్ని 22ఏ నుంచి తొలగించేందుకు చర్యలు


» ఎమ్మెల్యే వెలగపూడి చొరవతో జేసీ మయూర్ అశోక్ హామీ



జేసీ మయూర్ అశోక్‌ను కలిసిన భాను నగర్ కాలనీ వాసులు

వెంకోజీపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు భానునగర్‌లో స్థలాలన్నీ తమకు నష్టపరిహారంగా ఇచ్చినవేనని, ప్రభుత్వ స్థలాలు కాదని, వెంటనే తమ ప్రాంతాన్ని 22ఏ నుంచి తొలగించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కలిసి భానునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ఎమ్మెల్యే చొరవ తీసుకుని విశాఖ జేసీ కె.మయూర్ అశోక్‌తో మాట్లాడారు. అనంతరం.. అసోసియేషన్ సభ్యులకు జేసీని కలవమని చెప్పడంతో పాటు 22ఏ నుంచి భానునగర్ ప్రాంతాన్ని తొలగించే చర్యలు చేపట్టాలని జేసీకి ఎమ్మెల్యే కోరారు. ఈ నేపథ్యంలో తనను కలిసిన కాలనీవాసులతో జేసీ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ వెంటనే సర్వేను చేపట్టి, భానునగర్ ప్రాంతాన్ని 22ఏ లో తొలగించే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ విషయమై సహకరించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. జేసీని కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులు వంకా శివశంకర్ లాజరస్, ఒమ్మి నాయుడు, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఇన్విటేషనల్ ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వెంకోజీపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సూపర్ కిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో వచ్చే నెల 10న ఇన్విటేషనల్ ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్-2025 పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ చైర్మన్ పి.శ్రీనివాస్ పట్నాయక్ తెలిపారు. బుధవారం హెచ్‌బీ కాలనీలో ఈ పోటీలకు సంబంధించి వాల్ పోస్టర్‌ను నిర్వాహకులు ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా క్లబ్ చైర్మన్ పి.శ్రీనివాస్ పట్నాయక్ మాట్లాడుతూ ఏయూ బాక్సింగ్ హాలులో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి సీఈవో డాక్టర్ ఐవీహెచ్ ప్రసాద్, క్లస్టర్ హెడ్ డాక్టర్ ఆదిత్య కౌరా, క్యాన్సర్ విభాగం హెడ్ ఎస్.భరణికుమార్, కిక్ బాక్సింగ్ అంతర్జాతీయ రెఫరీ జి.ఆనందబాబు, పోటీల చీఫ్ ఆర్గనైజర్ సీహెచ్ ప్రసాదరావు, ఆర్గనైజర్ సీహెచ్ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన గంటా



పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : హరిహర వీరమల్లు సినిమా ప్రమోషన్‌లో భాగంగా బుధవారం నగరానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిశారు. రాజకీయాల్లో బిజీ కారణంగా చాలా కాలం తరువాత వస్తున్న సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అందించాలని గంటా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తజోనర్‌లో పవన్‌కల్యాణ్ నటించిన ఈ సినిమా విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని, ఈ చిత్రం అభిమానులను ఉర్రూతలూగించడం ఖాయమని గంటా ఆశాభావం వ్యక్తం చేశారు.

‘విమ్స్’కు ‘ఇండస్’ వెంటిలేటర్ వితరణ



విమ్స్ ఆస్పత్రికి వెంటిలేటర్ అందజేస్తున్న ఇండస్ ఆస్పత్రి ఎం.డి. శ్రీధర్

ఆరిలోవ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)కు ఇండస్ ఆస్పత్రి యాజమాన్యం వెంటిలేటర్‌ను వితరణ చేసింది. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబుకు ఇండస్ ఆస్పత్రి ఎం.డి. డాక్టర్ శ్రీధర్ వెంటిలేటర్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యసదుపాయం అందించేందుకు వెంటిలేటర్‌ను వితరణ చేయడం అభినందనీయమన్నారు. అత్యవసర చికిత్స కోసం వచ్చిన రోగులకు వెంటిలేటర్ ఎంతో అవసరమన్నారు.తమ వద్ద ఉన్నవెంటిలేటర్‌కు అదనంగా మరో వెంటిలేటర్ అందుబాటులోకి రావడం సంతోషంగా ఉన్న దన్నారు. కార్యక్రమంలో ఇండస్ ఆసుపత్రి సీఈవో చంద్రమౌళి, జీఎం ఆపరేష్ సుధీర తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పాల్గొన్న కార్పొరేటర్ లావణ్య, పలువురు నేతలు, అధికారులు

ఎంవీపీ కాలనీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 17వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ ఎనిమిదో సెక్టరులో పలు అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ.. కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇక్కడ రూ.43 లక్షల జీవీఎంసీ నిధులతో రోడ్లు నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే వెలగపూడి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గేదెల లావణ్య, తెలుగుదేశం నాయకులు చోడె పట్టాభిరాం, కాళ్ల శంకర్, జీవీఎంసీ ఈఈ గంగాధర్, డీఈ పద్మావతి, ఏఈ అప్పలనాయుడుపాల్గొన్నారు.

‘అర్హులందరికీ సంక్షేమ పథకాలు’



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నేతలు బొట్టా వెంకటరమణ తదితరులు

మద్దిలపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా 22వ వార్డులో బుధవారం టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలుతో ప్రజలకు సంక్షేమందించారన్నారు. సమస్యలున్న వారు తమను సంప్రదిస్తే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొంతమంది గ్యాస్ నగదు రాలేదని చెప్పడంతో వారి వివరాలు తీసుకుని యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, నాగూర్‌మీరా, మదీనా పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

మద్దిలపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో అనధికారకంగా చేపడుతున్న నిర్మాణాన్ని జోన్-3 టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. జాతీయ రహదారి నుంచి మద్దిలపాలెం వెళ్లే రహదారిలో ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని సందు ఉంది. ఈ సందులో ఓ వ్యక్తి మూడు అంతస్తులకు ప్లాన్ అనుమతులు పొందాడు. కాగా మూడు అంతస్తులకు శ్లాబ్‌లు నిర్మాణం చేసి అదనంగా మరో అంతస్తు నిర్మాణానికి సెంట్రింగ్ చేశారు. ఇది గమనించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది శ్లాబ్ నిర్మాణానికి వేసిన సెంట్రింగ్‌ను తొలగించారు.



శ్లాబు సెంట్రింగ్ తొలగిస్తున్న దృశ్యం

ఆడబిడ్డ నిధిని ఎగ్గొట్టే ప్రయత్నం

» ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపణ

మద్దిలపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన ఆడబిడ్డ నిధి పథకం హామీని ఎగ్గొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విమర్శించారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడెందుకు సంపద సృష్టించకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చడం కష్టమని చెబుతున్నారని ప్రశ్నించారు. ఏడాదిలో రూ.1.86 లక్షల కోట్లు అప్పు చేసి రూ.37 వేల కోట్లు ఆడబిడ్డ నిధి పథకానికి ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీల పేరిట ఊదరగొట్టి అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేకపోయారని విమర్శించారు. ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే ఆంధ్రనే అమ్మాలని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు.

ఖైదీలు పండించిన కూరగాయల విక్రయం

ఆరిలోవ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో ఖైదీలు పండిస్తున్న కూరగాయలను జైలు ప్రధాన ద్వారం విక్రయిస్తున్నారు. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా పండించినవి కావడంతో ఇక్కడ విక్రయించే కాయగూరలకు డిమాండ్ ఉంటుంది. వీటిని విక్రయిస్తున్నట్టు తెలియడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఏ రోజు కాయగూరలను ఆ రోజే తోటల నుంచి కోసి ఉదయం 7-30 నుంచి విక్రయాలు చేపడుతున్నారు. బుధవారం సుమారు 50 కిలోల బెండకాయలు, 20 కిలోల వంకాయలు. 20 కిలోల కాకరకాయలతో పాటు తోటకూర, పాలకూరల విక్రయాలు చేపట్టారు. బెండ కిలో 30 రూపాయలు, వంకాయలు కిలో 35 రూపాయలు, కాకరకాయలు కిలో 30 రూపాయలు, తోటకూర, పాల కూరలు కట్ట 20 రూపాయల చొప్పున విక్రయించారు.

వాస్తవ ఘటనలతోనే 'రాజుగాని సవాల్'



హీరో లెలిజాల రవీందర్, హీరోయిన్ రితికా చక్రవర్తిలను సత్కరించిన అభిమానులు

సీతంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లెలిజాల రవీందర్, సంధ్య రాథోడ్, రితికా చక్రవర్తి నటీనటులుగా రూపొందిస్తున్న 'రాజు గాని సవాల్' చిత్ర బృందం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో బుధవారం సందడి చేసింది. ఈ సందర్భంగా హీరో, దర్శక నిర్మాత లెలిజాల రవీందర్, హీరోయిన్ రితికా చక్రవర్తిలు మాట్లాడుతూ ఈ చిత్రం ఆగస్టు 8న శ్రీలక్ష్మి పిక్చర్స్ ద్వారా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోందన్నారు. తమ జీవితాల్లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందించిన చిత్రమని పేర్కొన్నారు. సహజంగా ఉండేందుకు కవాడిగూడ రియల్ లోకేషన్స్‌లో చిత్రీకరించామన్నారు. మధ్యతరగతి వారి జీవితంలో ఎన్నో సవాళ్లు ఉంటాయని, అలాంటి సందర్భంలో ఒ పెద్ద సమస్య ఎదురైతే ఓ వ్యక్తి ఎలా ఎదుర్కొన్నాడనేది చిత్రంలో చూస్తారన్నారు. ఈ చిత్రాన్ని లెలిజుల కమల ప్రజాపతి సమర్పణలో, ఎల్ఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై లెలిజుల రవీందర్ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారన్నారు. చిత్రంలో మరో హీ రోయిన్‌గా సంధ్య రాథోడ్, బొమ్మకంటి తదితరులు నటిస్తున్నారు. బాపిరాజు ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు.

ఆరుద్ర నక్షత్ర పూజలు

సీతమ్మధార, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాసశివరాత్రి, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహా శివలింగానికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివలింగానికి వెండి ఆభరణాలతో అలంకరించారు. అర్చకులు రామారావు శర్మ, ఉమామహేశ్వర శర్మలు వేద మంత్రాలతో నవధాన్య పంచామృతాభిషేకాలు, ఫల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఆలయంలో రుద్రాభిషేకాలు చేయించారు.

'పదవులకు వన్నె తెచ్చిన నేత అశోక్‌గజపతిరాజు'



అశోక్ గజపతిరాజుతో మూల వెంకటరావు

మురళీనగర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్‌గజపతి రాజుకు బీసీ నాయకుడు, బీజేపీ వికసిత్ భారత్- 2047 విశాఖ జిల్లా కో-కన్వీనర్ మూల వెంకటరావు శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం ఆయన విజయనగరం వెళ్లి అశోక్ బంగ్లాలో గజపతిరాజును కలసి శాలువాతో సత్కరించారు. అనంతరం బొకే అందించి అభినందించారు. వెంకటరావు మాట్లాడుతూ రాజకీయాల్లో అవినీతి మరకలేని, నిజాయతీపరుడైన అశోక్ గజపతిరాజును గవర్నర్ పదవి వరించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రిగా, ఎమ్మెల్యే, ఎంపీగా ఆయన చేపట్టిన పదవులకు వన్నె తెచ్చారని కీర్తించారు. గోవా గవర్నర్‌గా కొత్త బాధ్యతల్లోనూ మరిన్ని పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఆకాంక్షించారు.

భవిత కేంద్రంలో స్పీచ్ థెరపీ ప్రారంభం



స్పీచ్ థెరపీ అందిస్తున్న బాలేశ్వరి

అక్కయ్యపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని భవిత కేంద్రంలో మాట్లాడలేని దివ్యాంగ విద్యార్థులకు బుధవారం స్పీచ్ థెరపీ ప్రారంభించారు. అయిదు మండలాలకు సంబంధించి ఈ సమస్య ఉన్న 70 మంది పిల్లలకు భాష ఉచ్చారణ మెరుగుపరిచేందుకు స్పీచ్ థెరపిస్ట్ బాలేశ్వరి మెలకువలు నేర్పుతూ తర్ఫీదు అందించారు. వారంలో రెండు రోజుల చొప్పున ప్రతి మండలానికి ఒక కేంద్రంగా అవసరమైన పిల్లలకు ఈ స్పీచ్ థెరపీ అందించనున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్, ఎంఈవోలు రామారావు, బాలామణి, ప్రధానోపాధ్యాయిని రాధాకుమారి, కేంద్రం ఉపాధ్యాయులు శారద, జగదాంబ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు ఉంచాలి

» జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజు

అల్లిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయంలో ఉంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు ఆదేశించారు. బుధవారం అల్లిపురంలోని శాఖా గ్రంథాలయాన్ని తనిఖీ చేసి, అక్కడ పరిస్థితులపై గ్రంథాలయ అధికారి పి.వి.నూకరాజును అడిగి తెలుసుకున్నారు. సమీప పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలసి పుస్తక మహోత్సవం (బుక్ ఫెస్టివల్) వంటి కార్యక్రమాలకు ఆహ్వానించాలన్నారు. స్థానికుల సహకారం తీసుకొని గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించండి

» నిబద్ధత, నిజాయితీ, సేవాతత్పరత ముఖ్యం » ప్రొబేషనరీ ఎస్ఐలకు విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్‌జట్టి సూచన



ప్రొబేషనరీ ఎస్ఐలతో డీఐజీ గోపినాథ్‌జట్టీ, మూడు జిల్లాల ఎస్పీలు

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో విధులు నిర్వహించాలని ప్రొబేషనరీ ఎస్ఐలకు విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్‌జట్టీ సూచించారు. ప్రాథమిక శిక్షణ పూర్తిచేసుకున్న 49 మంది (33 మంది పురుషులు, 16 మంది మహిళలు) ప్రొబేషనరీ ఎస్ఐలు బుధవారం నగరంలోని రేంజ్ కార్యాలయంలో డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీ, సేవాతత్పరత ముఖ్యమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేయాలన్నారు. నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాన్నారు. ప్రొబేషనరీ సమయంలో సీనియర్లు, సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు ఏర్పరచుకోవాలని డీఐజీ సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు మహేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, వకుల్ జిందాల్, అమిత్‌బర్దార్‌లు ప్రొబేషనరీ ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రొబేషనరీ ఎస్ఐలు తమకు కేటాయించిన జిల్లాల్లో ఐదు నెలలపాటు ప్రాక్టికల్ ట్రైనింగ్ తీసుకోనున్నారు. శిక్షణ కోసం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు పది మంది చొప్పున, విజయనగరం జిల్లాకు తొమ్మిది మందిని కేటాయించారు.

ఐటీఐల్లో రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం



సీటు కేటాయింపు ఉత్తర్వు అందుకుంటున్న విద్యార్థి

కంచరపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఐటీఐల్లో ఆగస్టు 2025-26 విద్యాసంవత్సరానికి రెండో విడత ప్రవేశాల ప్రక్రియ కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో బుధవారం అధికారులు ప్రారంభించారు. బాలికలు, ఈడబ్ల్యూఎస్, మాజీ సైనికులు, దివ్యాంగులు, బీసీఈ, స్టీల్ ప్లాంట్ భూ బాధితులతో పాటు మొదటి ర్యాంకు నుంచి 400 ర్యాంకు వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరిలో ప్రతిభ ప్రాతిపదికన సీట్లు కేటాయించినట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. మూడు రోజులు జరగనున్న ఈ కౌన్సెలింగ్‌లో గురువారం 401వ ర్యాంకు నుంచి 1200వ ర్యాంకు వరకు, శుక్రవారం 1201వ ర్యాంకు నుంచి ఆఖరి ర్యాంకు వరకు గల అభ్యర్థులకు ప్రభుత్వ ఐటీఐల్లో సీట్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు అధికారులు తెలియజేశారు. ప్రైవేటు ఐటీఐల్లో సీట్లకు ఈ నెల 26, 27 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

ఉత్తమ పారిశ్రామిక శిక్షణ సంస్థగా ప్రభుత్వ పాత ఐటీఐ



ఢిల్లీలో కేంద్రమంత్రుల నుంచి అవార్డు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్

కంచరపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)గా కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ గుర్తింపు పొందింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ అవార్డును స్వీకరించారు. కేంద్ర మంత్రులు జయంత్ చౌదరి, సుకంతా మజుందార్‌ల నుంచి ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఢిల్లీ ఉపాధి, పారిశ్రామిక శిక్షణ శాఖ డైరెక్టర్ జి.గణేష్‌కుమార్, అడిషనల్ డైరెక్టర్ జి.బాలసుబ్రహ్మణ్యంల సమక్షంలో ఈ అవార్డును స్వీకరించారు. దక్షిణ భారతదేశంలోనే ప్రభుత్వ ఐటీఐల్లో కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐకి మౌలిక వసతులు, శిక్షణ అందించే తీరు, ఎక్విప్‌మెంట్ తదితర అంశాల్లో ప్రత్యేక స్థానం ఉంది. ఉత్తమ ఐటీఐగా గుర్తింపు పొంది అవార్డును స్వీకరించడం ఆనందంగా ఉందని ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ విజయానికి కారకులైన అధికారులు, సిబ్బందికి ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అభినందనలు తెలియజేశారు.

మానవ అక్రమ రవాణాను నిరోధిద్దాం

» డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ ఎస్.దివాకర్ పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెప్టెన్ ఎస్.దివాకర్ తదితరులు

సీతమ్మధార, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ 'మానవ అక్రమ రవాణాను అరికట్టండి' నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. సీతమ్మధారలో గల డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ కార్యాలయంలో చీఫ్ జనరల్ మేనేజర్ కెప్టెన్ ఎస్.దివాకర్ దీన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో మానవ అక్రమ రవాణా కూడా ఒకటన్నారు. ఈ చర్య ద్వారా ఎంతో మంది అమాయకులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మనిషి ఆశాలు, ఆశయాలతో ఆడుకునే దుశ్చర్య అన్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల వికాస్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్ బాబ్జి, మహ్మద్ హుస్సేన్, అప్పారావు పాల్గొన్నారు.

చెత్త విభజనపై ప్రజలను చైతన్యపరుస్తున్నాం

» శానిటరీ ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరెడ్డి



చెత్త విభజనపై డెమో ద్వారా ప్రజలకు అవగాహన కలిగిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరెడ్డి

డాబాగార్డెన్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు 31వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కామేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం వార్డు పరిధిలోని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు ఆదేశాల మేరకు ప్రతి ఇంటి నుంచి సేకరించడం, ఇంటి వద్దనే తడి, పొడి, ప్రమాదకరమైన చెత్త విభజనపై అవగాహన కలిగించినట్లు తెలిపారు. తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను డెమో, బ్యానర్, ప్లకార్డుల ద్వారా ప్రజలకు అవగాహన కలిగించారు. ప్లాస్టిక్ నిషేధం అవసరాన్ని ప్రజలకు వివరించారు. రోజువారీ చెత్తను వేరు చేసి క్లాప్ వాహనాలకు అందజేయాలని, తద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ శుభ్రతకు ముందుకురావాలని కామేశ్వరరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానికులు, చిరుదుకాణదారులు, పీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

'విమ్స్'కు 'ఇండస్' వెంటిలేటర్ వితరణ



మహారాణిపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)కు ఇండస్ ఆస్పత్రి యాజమాన్యం వెంటిలేటర్‌ను వితరణ చేసింది. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబుకు ఇండస్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ శ్రీధర్ వెంటిలేటర్‌ను బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యసదుపాయం అందించేందుకు వెంటిలేటర్‌ను వితరణ చేయడం అభినందనీయమన్నారు. అత్యవసర చికిత్స కోసం వచ్చిన రోగులకు వెంటిలేటర్ ఎంతో అవసరమన్నారు.తమ వద్ద ఉన్నవెంటిలేటర్‌కు అదనంగా మరో వెంటిలేటర్ అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఇండస్ ఆసుపత్రి సీఈవో చంద్రమౌళి, జీఎం ఆపరేషన్ సుధీర్ పాల్గొన్నారు.

3 ఐటీ పార్కులు

... 5వ పేజీ తరువాయి

రహేజా సంస్థ కూడా మౌలిక వసతుల కల్పనకు సంసిద్ధత వ్యక్తంచేసిందన్నారు. టీసీఎస్ సంస్థ రుషికొండ ఐటీ హిల్స్‌లో కేటాయించిన భవనంలో వసతులు సమకూర్చుకుంటుందన్నారు. ఏపీఐఐసీ ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తోందన్నారు. బహుశా ఈ ఏడాది అక్టోబరు నుంచి టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. నవంబరులో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సులో టీసీఎస్, కాగ్నిజెంట్, మరికొన్ని ఐటీ కంపెనీలకు కేటాయించిన భూముల్లో భూమి పూజ చేయనున్నాయని తెలిపారు. ఈ ఏడాది చివరికల్లా పలు కంపెనీలు విశాఖ నుంచి ఆపరేషన్స్ ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఐటీ కంపెనీల కోసం సుమారు 200 ఎకరాలు సిద్ధంగా ఉంచామన్నారు. ఆర్కే బీచ్‌రోడ్డు సమీపాన లులూ గ్రూపు నెలకొల్పనున్న షాపింగ్ మాల్ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నగరానికి రానున్నారని, ఈ సందర్భంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్, బీచ్‌రోడ్డులో వీఎంఆర్‌డీఏ ఏర్పాటుచేసిన హెలికాప్టర్ మ్యూజియం, ఇతర ప్రాజెక్టులను ప్రారంభిస్తారన్నారు. జిల్లాలో పీ-4లో భాగంగా గుర్తించిన 73 వేల బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం చేసే ప్రక్రియ వేగంగా జరుగుతుందన్నారు. ఇప్పటివరకూ 26 వేల కుటుంబాల కోసం 2600 మంది మార్గదర్శకుల ఎంపిక పూర్తయిందన్నారు. బంగారు కుటుంబాలకు ఎటువంటి సాయం కావాలనే దానిపై రూట్స్ అనే యాప్ ద్వారా సర్వే జరుగుతుందన్నారు. ఎవరికి ఎటువంటి సాయం కావాలి?...అనేది సర్వేలో తేలిన తరువాత ఆయా కుటుంబాలకు చేయూత అందించే ప్రక్రియ మొదలవుతుందన్నారు. వచ్చే నెల 15వ తేదీన బంగారు కుటుంబాలకు సాయం అందించే కార్యక్రమం ప్రారంభించాలని యోచిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కేజీహెచ్‌లో సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండేలా ఆదేశాలు ఇస్తామన్నారు.

బిల్లెట్ల కన్వర్షన్ ప్రైవేటుపరం

... 5వ పేజీ తరువాయి

స్టీల్ ప్లాంటు సరఫరా చేస్తే వాటిని కొత్తవలసలో గల స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా రోలింగ్ మిల్స్‌లో 'వైజాగ్ టీఎంటీ బార్లు'గా తయారుచేసి వెనక్కి ఇస్తుంది. వాటిని స్టీల్ ప్లాంటు మార్కెట్‌లో విక్రయిస్తుంది. ఇందుకుగాను ఏడాదికి రూ.70 కోట్లు వరకు స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియాకు చెల్లించడానికి స్టీల్ ప్లాంటు అంగీకరించింది. రెండేళ్లకు ఒప్పందం చేసుకున్నారు. ఇంకో ఏడాది ఒప్పందం పెంచుకునే అవకాశం ఉంది. ఈ విధంగా మొత్తం రూ.210 కోట్ల విలువైన పని వైజాగ్ ప్రొఫైల్స్‌కు దక్కింది.

విద్యార్థుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

బైఠాయించారు. తెల్లవారుజాము వరకూ నిరసన కొనసాగించారు. బుధవారం ఉదయం హాస్టళ్లు, తరగతి గదుల వద్దకు వెళ్లి మరింత మంది విద్యార్థులను కూడగట్టారు. అనంతరం ర్యాలీగా వైస్ చాన్సలర్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. అధికారుల నిరంకుశ వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. భోజనంలో పురుగులు వస్తున్నా, విద్యార్థులు సమస్యలతో అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో వైస్ చాన్సలర్ స్వయంగా సమస్యలు చెప్పాలంటూ విద్యార్థుల మధ్యకు వెళ్లి కూర్చున్నారు. నాణ్యమైన భోజనం పెట్టాలని, వసతి గృహాల్లో బెడ్స్ ఏర్పాటు చేయాలని, క్యాంపస్‌లో వై-ఫై సదుపాయం కల్పించాలని, మహిళల వసతి గృహాల్లోకి పాములు, పురుగులు రాకుండా మెష్‌లు ఏర్పాటుచేయాలని కోరారు. విద్యార్థుల డిమాండ్లపై వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ వర్సిటీలోని సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. కొన్ని హాస్టళ్లలోని మెస్‌లలో డైనింగ్, ఇతర పనులు చేశామని, మిగిలిన వాటిల్లో కూడా పూర్తి చేస్తామన్నారు. నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించేలా చర్యలు చేపడతామని, ఇందుకోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. మెస్ నిర్వహణకు స్టూడెంట్ కమిటీలు ఏర్పాటుచేస్తామని, ఇందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. ఆయా సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తామన్న దానిపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు విద్యార్థులతో చర్చలు జరిపారు. నెలరోజుల్లో మెజారిటీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విద్యార్థులు తమ ఆందోళనను విరమించారు.

మాక్‌డ్రిల్‌లో అపశ్రుతి

... 5వ పేజీ తరువాయి

చికిత్స పొందుతున్న చిన్నారిని పరామర్శించారు. పోలీసుల వ్యవహారశైలిపై మండిపడ్డారు. చిన్నారికి గాయమైనా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అంశాన్ని కలెక్టర్, సీపీ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. బీడీఎల్ అధికారులపై కేసు నమోదు చేయకపోవడం సరికాదన్నారు. చిన్నారి చికిత్స బాధ్యతను ఎవరు వహిస్తారని ఎస్ఐ శ్రీనివాస్‌ను ప్రశ్నించారు.

ఈ ఘటన గురించి దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా, బాంబులు పేల్చిన సమయంలో బందోబస్తులోని సిబ్బందికి, మాక్‌డ్రిల్‌లో ఉన్న కమెండోలకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. ఆ సమయంలో పలువురు ద్విచక్ర వాహనదారులు గేటు బయట రోడ్డుపై ఉన్నా ఎవరికీ గాయాలవ్వలేదని, ఘటనకు సంబంధించి సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించామన్నారు. దీనిపై ఎవరిపైనా కేసు నమోదు చేయలేదని వివరించారు.

భద్రయ్యపేటలో వైద్య సిబ్బంది సర్వే



గ్రామంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పద్మనాభం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేట గ్రామాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 'మంచంపట్టిన భద్రయ్యపేట' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. గ్రామాన్ని సందర్శించి, వైద్య సిబ్బందితో ఇంటింటి సర్వే చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధితో ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. వ్యాధి ప్రబలడానికి గల కారణాలను పరిశీలించడంతో పాటు వైద్య కళాశాలకు కూడా నివేదిస్తామన్నారు. రోగులకు అవసరమైన వైద్య సదుపాయం అందిస్తామని చెప్పారు. గ్రామస్తులందరికీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వ్యాధిగ్రస్తులను పరిశీలించి మాట్లాడారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి రాత్రి వరకు సర్వే చేశారు. వ్యాధి బారిన పడిన వారి ఆరోగ్య పరిస్థితి, బీపీ, షుగర్, సీఎస్ కేర్ తదితర వాటిని పరిశీలించారు. వయస్సు పైబడిన వారు ఈ వ్యాధితో తీవ్రంగా బాధపడుతున్నట్టు గుర్తించారు. ఒకే ఇంట్లో భార్య, భర్త కూడా వ్యాధి బారిన పడినట్టు తెలిపారు. పీఓ ఉమావతి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు ఉన్నారు.

విశాఖ నా గుండెల్లో ఉంటుంది



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు

... 5వ పేజీ తరువాయి



హీరోయిన్ నిధి అగర్వాల్

చేశారు. 'బైబైయ్యే బంగారు రమణమ్మా'..., 'లబోలబో లబరి గాజులు'...పాటలు పాడిన పవన్ కల్యాణ్...తనకు నటనలో ఓనమాలు నేర్పిన సత్యానంద్ మాస్టారు ఉత్తరాంధ్ర, ఆట, పాట గుండెల్లో అణువణువూ నింపేశారన్నారు. సినిమాల గురించి చెప్పాలంటే తనకు సిగ్గు అన్నారు. అయితే డోలీ మోతలతో ఇబ్బందిపడే గ్రామాలకు రోడ్లు వేయించగలనని, తనను తిట్టే ప్రత్యర్థి పార్టీల సర్పంచులకు అడగకుండా నిధులు మంజూరు చేయగలనన్నారు. తనకు ఇవ్వడమే తప్ప అడగడం తెలియదన్నారు. సినిమాను ప్రేమించడం మాత్రమే తనకు తెలుసునన్నారు. తాను జీవితంలో ఒక స్థాయికి చేరుకునేందుకు అన్నయ్య, వదిన ఎంతగానో కృషిచేశారని, అందుకే గెలిచిన తరువాత వారి పాదాల వద్ద తన శిరస్సును పెట్టానన్నారు. తనకు అతిపెద్ద హిట్ ఇవ్వాలన్న ఉద్దేశంతో రత్నం ఒక కథను చెప్పారన్నారు. ఈ సినిమాను 40 శాతం క్రిష్ డైరెక్ట్ చేశారని, కొన్ని కారణాల వల్ల ఆయన ప్రాజెక్టు నుంచి పక్కకు వెళ్లిపోయినప్పటికీ జ్యోతి అద్భుతంగా డైరెక్ట్ చేశారన్నారు. తక్కువ సమయంలో ఎఫెక్టివ్‌గా సినిమాను తీసినట్టు వెల్లడించారు. కోహినూర్ వజ్రాన్ని తీసుకువచ్చే క్రమంలో ఎదురయ్యే అనుభవాలు వంటివన్నీ ఆసక్తికరంగా చిత్రీకరించినట్టు తెలిపారు.

తప్పుడు రిజిస్ట్రేషన్లకు చెక్

... 5వ పేజీ తరువాయి

ఇస్తున్నారు. కోర్టుకు వెళితే కేసులు ఒకంతట తేలడం లేదు. దశాబ్దాలు గడిచిపోతున్నాయి. దీంతో ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏదైనా రిజిస్ట్రేషన్ తప్పుగా చేశారని, అందులో మోసం జరిగిందని తేలితే ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9వ తేదీన 267, 268 గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించింది. అంటే కోర్టుల చుట్టూ తిరగాల్సిన పని లేదు. తప్పు జరిగిందని నిర్ధారణ అయితే చాలు...కలెక్టర్ దానిని రద్దు చేయొచ్చు. అయితే ఈ ప్రక్రియకు సంబంధించి ఇంకా విధి విధానాలు రావలసి ఉంది. ఇప్పటివకూ ప్రభుత్వ భూములను ఎవరికైనా రిజిస్టర్ చేసినట్టు తెలిస్తే కలెక్టర్ ఆర్డర్ ద్వారా వాటిని సబ్ రిజిస్ట్రార్లు రద్దు చేస్తున్నారు. జిరాయితీ భూముల మోసాలకు సంబంధించి కోర్టు ఆదేశాలనే పాటిస్తున్నారు. లేదంటే కొన్నవారు, అమ్మినవారు ఇద్దరూ వచ్చి తమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరితే...అప్పుడు చేయగలుగుతున్నారు. ఇకపై తప్పు అని తేలితే దానిని కలెక్టర్ రద్దు చేయొచ్చు. దీనివల్ల సమస్యకు త్వరగా పరిష్కారం లభిస్తుంది.

యువకుడిపై పోక్సో కేసు

... 5వ పేజీ తరువాయి

ఏసీపీ కాళిదాసు సోమవారం పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం మంగళవారం న్యాయాధికారి వద్ద హాజరుపరిచారు. అయితే ఆదివారం తనను స్టేషన్‌లో ఉంచినప్పుడు సీఐ దాలిబాబు ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీను, రైటర్ సంతోష్ కలిసి తనను చిత్రహింసలకు గురిచేశారని, మర్మాంగంపై అగరవత్తితో కాల్చడంతో తీవ్రగాయాలయ్యాయని న్యాయాధికారికి నిందితుడు రామకృష్ణ ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో నిందితుడికి రిమాండ్ విధించిన మెజిస్ట్రేట్...ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీ శంఖబ్రతబాగ్చీని ఆదేశించినట్టు సమాచారం. మెజిస్ట్రేట్ ఆదేశాలతో సీపీ శంఖబ్రతబాగ్చి దీనిపై హార్బర్ ఏసీపీని వివరణ కోరారు. తాను నిందితుడిని సోమవారం అరెస్టు చేశానని, నిందితుడి మర్మాంగంపై గాయపరిచిన ఘటన ఆదివారం జరిగిందని, సోమవారం తనకు ఆ విషయాన్ని స్టేషన్ సిబ్బందిగానీ, నిందితుడుగానీ చెప్పలేదని వివరణ ఇచ్చినట్టు సమాచారం. నిందితుడిని స్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేసిన విషయం బయటకు పొక్కడంతో సీపీ ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

వాణిజ్య భవనాల్లో భద్రత ప్రశ్నార్థకం?

... 5వ పేజీ తరువాయి

వాణిజ్య సముదాయాలు, భారీ భవనాలు, గోడౌన్లు నిర్మితమయ్యాయి. వాణిజ్య అవసరాల కోసం నిర్మించే ప్రతి భవనానికీ అగ్నిమాపక శాఖ అనుమతి తప్పనిసరి. అయితే గ్రామీణ ప్రాంతంలో ఎన్ని భవనాలకు ఈ అనుమతులున్నాయనే దానిపై సమాచారం కొరవడుతోంది. నగరంలో భారీ భవనాలు నిర్మించదలిస్తే పలు శాఖల అనుమతులు ఉంటేనే పట్టణ ప్రణాళికా విభాగం ప్లాన్‌ను ఆమోదించే అవకాశం ఉంటుంది. అయితే గ్రామీణ ప్రాంతంలో భారీ నిర్మాణాలకు అనుమతుల విషయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్న దాఖలాలు కనిపించడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సర్పంచులు లేదా అధికార పార్టీ నేతల మాట కాదనే పరిస్థితి లేకపోవడంతో వారు మిన్నకుంటున్నారనే వాదన ఉంది. ఈ నేపథ్యంలో భారీ భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, పన్నులు విధించడంలో సర్పంచుల మాటే చెల్లుబాటవుతోందని చెబుతున్నారు.

సమాచారంపై సందిగ్ధం

ఆనందపురం మండల పరిసరాల్లో పలు విద్యాసంస్థలు పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. కొందరు భూ యజమానులు ఆయా విద్యాసంస్థల కోసం భారీ భవనాలు నిర్మించి అందజేస్తున్నారు. వీటికి అగ్నిమాపక శాఖ అనుమతులు తీసుకున్నారా లేదా అనే దానిపై పంచాయతీ కార్యదర్శుల వద్దే సరైన సమాచారం లేదు. పెద్ద గోదాములు, భవనాలకు వీఎంఆర్‌డీఏ అనుమతులు ఇస్తోందని, అయినా పంచాయతీ కార్యదర్శులు పన్నులు విధించే సమయంలో అన్ని పత్రాలూ ఉన్నాయో లేదో చూడాల్సిన బాధ్యత ఉందని పంచాయతీ రిటైర్డు అధికారి ఒకరు తెలిపారు. విద్యా సంస్థల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. గండిగుండం ఐటీసీ గోదాములో సంభవించిన అగ్ని ప్రమాదాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రామీణ ప్రాంతంలోని వాణిజ్య భవనాలు, సముదాయాలు, విద్యాసంస్థల భవనాలకు అగ్నిమాపక శాఖ అనుమతులున్నాయా, ప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్‌ఫైటింగ్ సామగ్రి అందుబాటులో ఉంచారా?, లేదా?...అనేది పంచాయతీ అధికారులు తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు.



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరస్వామి

శివాలయంలో ప్రత్యేక పూజలు

అగనంపూడి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక లోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని అర్ధ నక్షత్రయుక్త పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో ఆలయానికి విచ్చేసి పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన, భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి అభినందనలు

పెదగంట్యాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఐ.వాణిని పెద గంట్యాడకు చెందిన కూటమి నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేజీహెచ్‌లోని ఆమె కార్యాలయంలో వాణిని కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు, టీడీపీ 75వ వార్డు ప్రధాన కార్యదర్శి ఎం.పెంటయ్య, జనసేన నాయకుడు యు.రమణయ్య, బీజేపీ నాయకుడు ఎ.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి

అగనంపూడి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఫార్మాసిటీ పునరావాస కాలనీల్లో గల విద్యుత్ సమస్యలపై స్థానిక కూటమి నాయకులు ఏపీఈపీడీసీఎల్ కశింకోట సర్కిల్ ఈఈ రామకృష్ణను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో గల విద్యుత్ సమస్యలను ఆయనకు వివరించారు. అగనంపూడి ప్రాంతంలో ఇటీవల విద్యుత్ కోతలు అధికమయ్యాయని, నివాసాలకు తగ్గట్టుగా ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో లోవోల్టేజీ సమస్య తలెత్తుందని, అందువల్ల స్థానికంగా సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈఈని కలిసిన వారిలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, నాయకులు డొక్కా రమేశ్, బి.సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఇంటక్ నాయకుల నిరసన

ఉక్కుటౌన్‌షిప్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ఇంటక్ నాయకులు ప్లాంట్ గేటు వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెండింగ్ జీతాలను చెల్లించాలని కోరారు. నాయకులు పీవీ నగేశ్, మంత్రి గోపీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీ వెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 44, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 20, పచ్చిమిర్చి 74, కాకరకాయలు 32, బీరకాయలు 26, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 22, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 52, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో)45, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 30, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 46, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 42, కూరపెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, మామిడిఅల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

తవ్వారు.. వదిలేశారు!

ఏళ్లు గడుస్తున్నా గోతులను పూడ్చని అధికారులు

ఇబ్బందులకు గురవుతున్న హరిజన జగ్గయ్యపాలెం వాసులు

అక్కిరెడ్డిపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి పనుల పేరిట రహదారుల మధ్య తవ్విన గోతులను పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరేళ్లయినా గోతులను ఎందుకు పూడ్చకుండా వదిలేశారో అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. జీవీఎంసీ 69వ వార్డు పరిధి హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో యూజీడీ పనుల్లో భాగంగా 2019లో రహదారుల మధ్యలో గోతులు తవ్వి పైపులను ఏర్పాటు చేశారు. పనులు ముగిశాక సంబంధిత సిబ్బంది ఆయా గోతులను తాత్కాలికంగా మట్టితో పూడ్చి వదిలేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు పూర్తి స్థాయిలో ఆయా రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టలేదు. ఈ వార్డు పరిధిలోని షీలానగర్, వెంకటేశ్వర కాలనీలో యూజీడీ పనులు చేపట్టాక గోతులను పూడ్చడంతో పాటు సిమెంటుతో చక్కగా రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. కానీ హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో మాత్రం ఎటువంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

వర్షాల సమయంలో ఆయా గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోతుండడంతో ద్విచక్ర వాహనదారులతో పాటు చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఎన్నిసార్లు అధికారులకు, నాయకులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



హరిజన జగ్గయ్యపాలెంలో గోతులమయమైన రహదారులు

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు 'నల్లూరు'



కార్యక్రమంలో పాల్గొన్న నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

కూర్మన్నపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. వార్డు పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో బుధవారం రాత్రి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నల్లూరు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనలో ప్రజలంతా సంతృప్తికరంగా ఉన్నారని, సీఎం చంద్రబాబు నాయకత్వం ప్రజలకు శ్రీరామరక్ష అని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, గణపతి, రమేశ్, జగదీశ్, సుబ్బయ్య, నాగార్జున, వెంకటేశ్, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతివ్వాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు సంజీవగిరి కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రట్టి వాసు, బైపిల్లి గాంధీ, శ్రీలక్ష్మి, ఉమ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నరసింహపాత్రుడు

బీపీసీఎల్‌కు స్థలం కేటాయింపుపై ఆందోళన



నినాదాలు చేస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం కాలనీని ఆనుకుని ఉన్న పోర్టు స్థలాన్ని బీపీసీఎల్‌కు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ మింది, అక్కిరెడ్డిపాలెం, పంచవటి కాలనీల ప్రజలు ఆందోళన చేపట్టారు. బుధవారం మింది, అక్కిరెడ్డిపాలెం, పంచవటి కాలనీలకు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు ఈ కేటాయింపు స్థలంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం ఇక్కడి స్థలాన్ని బీపీసీఎల్‌కు కేటాయించడం వల్ల పంచవటి, అక్కిరెడ్డిపాలెం, మింది కాలనీల ప్రజలు తీవ్ర కాలుష్య సమస్యను ఎదుర్కొనవలసి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల పోర్టు యాజమాన్యం తక్షణమే ఈ కేటాయింపును రద్దు చేసి ఇక్కడ గ్రీన్ బెల్ట్‌ను ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ప్రజాభిప్రాయాలకు వ్యతిరేకంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా తాము అఖిలపక్షంగా ఏర్పడి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గుడివాడ లతీశ్, సంద్రాన నూకరాజు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, కె.చిన్నారావు, గుంటూరు మూర్తి, సంద్రాన అంజి, అంగ లోకేశ్, ఎ.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఏసీపీగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏసీపీ

గాజువాక, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సౌత్ సబ్ డివిజన్ ఏసీపీగా నియమితులైన పి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన టి.త్రినాథ్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణకు మరింత సమర్థవంతంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సౌత్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి మంచి స్పందన

అగనంపూడి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ప్రాంత విశ్రాంతి ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరానికి మంచి స్పందన లభించింది. ఉక్కు విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ సభ్యులు సుమారు 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా అసోయేషన్ ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరరావు, బోసుబాబు, భాస్కరరాజులు మాట్లాడుతూ ఉక్కు విశ్రాంత ఉద్యోగుల కోసం ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుభద్ర, కె.పాల్, అసోసియేషన్ ప్రతినిధులు రామునాయుడు, రఫీ, రాజు, కాళిదాసు, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'గ్రాండ్ పేరెంట్స్ డే'

మల్కాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రాండ్ పేరెంట్స్ పిల్లలను ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారని, వారి అనుభవాలు పిల్లలకు తెలియజేయాలని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమకుమారి తెలిపారు. మల్కాపురం సెయింట్ జోసఫ్ స్కూల్‌లో బుధవారం 'గ్రాండ్ పేరెంట్స్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే మంచి విజ్ఞానం, క్రమశిక్షణ ఉంటే భవిష్యత్తు ఎంతో బాగుంటుందని అన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాధికారి సూర్యకళకు సత్కారం



గ్రంథాలయాధికారి సూర్యకళను సత్కరిస్తున్న దృశ్యం

పెందుర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల శాఖ గ్రంథాలయాధికారిగా విధులు నిర్వహించిన సూర్యకళ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆమెకు వీడ్కోలు సభ నిర్వహించి, ఘనంగా సత్కరించారు. అనంతరం ఆవిడ చేసిన సేవలని కొనియాడారు. అలాగే కొత్తగా గ్రంథాలయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రకళకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు వీడ్కోలు



ఆత్మీయ వీడ్కోలులో కార్పొరేటర్ దాడి వెంకట రమేశ్, తదితరులు

గోపాలపట్నం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా 89వ వార్డు సచివాలయాల్లో ఉద్యోగులకు వీడ్కోలు కార్యక్రమాన్ని కొత్తపాలెం గ్రామంలో ఓ ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ ఉద్యోగులను శాలువాలు కప్పి సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు రైతుల భూ పత్రాల పరిశీలన

వేపగుంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎంఆర్‌డీఏ భూముల వివాదానికి సంబంధించి ఆయా రైతుల భూపత్రాలను అధికారులు గురువారం జీవీఎంసీ కల్యాణ మండపంలో పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ భూపత్రాలతో ఉదయం 10 గంటలకు కల్యాణ మండపానికి చేరుకోవాని కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలియజేశారు.

ప్రభుత్వానికి అండగా నిలవాలి : మేయర్ 'పీలా'



మహిళకు కరపత్రం అందజేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 96 వార్డులో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మేయర్ పీలా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేందుకు కూటమి కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సుస్థిరపాలన అందిస్తున్న కూటమికి 2029 ఎన్నికల్లో కూడా పట్టం కట్టాలని, రెండో సారి అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

పెందుర్తిలో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న బైక్‌లు

పెందుర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నేరాలను అదుపు చేసేందుకు స్థానికంగా పలు ప్రాంతాల్లో సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పన్నపాలెంలో ముషిడివాడ, పెందుర్తి, సరిపల్లి, పినగాడిలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పత్రాలు లేని పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రైల్వేస్టేషన్‌లో నాకాబందీ చేపట్టారు. అనుమానస్పద ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా సీఐ కేవీ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ నేరాలను అదుపు చేసేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, కాలనీల్లో అనుమానస్పద వ్యక్తుల మీద నిఘా ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరు తమకు సహకరించాలని కోరారు.

నింగిన తాకుతున్న టమాటా ధర



రైతు బజారులో టమాటాలు

గోపాలపట్నం, జూలై 23(ఆంధ్రజ్యోతి): దేశవాళీ టమాటా సీజన్ ముగియడంతో రోజు రోజుకు ధర పెరిగిపోతోంది. ప్రస్తుతం రైతుబజారులో కిలో టమాటా ధర రూ.44కి విక్రయిస్తున్నారు. నెల వ్యవధిలో టమాటా ధర రూ. 20కి పైగా పెరిగిపోయింది. ఏటా ఫిబ్రవరి నెల నుంచి జిల్లాలో టమాటా సీజన్ ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి దాదాపుగా జూన్ నెల వరకు దేశవాళీ టమాటాలు లభిస్తాయి. దీంతో ఈ నెలల్లో టమాటా ధర తగ్గాలి, కానీ ప్రస్తుతం సీజన్ ముగియడంతో చిత్తూరు, అనంతరపురం జిల్లాలతో పాటు కర్ణాటక నుంచి కూడా నగరానికి టమాటా దిగుమతి జరుగుతోంది. దీంతో టమాటా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రానున్న రోజుల్లో టమాటా ధర పెరిగే అవకాశం ఉందని వర్తకులు చెబుతున్నారు.

'భగవద్గీత మానవుని జీవితానికి ప్రామాణికం'

వేపగుంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): భగవద్గీత మానవుని జీవనానికి ఒక ప్రామాణికమని తవేరానందస్వామి పేర్కొన్నారు. స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం సాయంత్రం భగవద్గీతలోని 12వ అధ్యాయంపై ఆయన ప్రవచనాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మానవుడు భగవద్గీత ఎందుకు చదవాలి, ఎంత వరకు అవసరం, అనే అంశాలను వివరించారు. ఈ నెల 23 నుంచి 27 వరకు సాయంత్రం 6:30 నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తియోగం అధ్యాయనం పూర్తి చేస్తానని తవేరానంద స్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చూసుకుంది.



నినాదాలు చేస్తున్న ఉక్కు నిర్వాసితులు

నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపాలి

నేడు పరిపాలన భవనం వద్ద ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉక్కు నిర్వాసిత కాంట్రాక్టు లేబర్ యూనియన్, ఐక్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులు బుధవారం ప్లాంట్ నెహ్రూ పార్కులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించకపోవడం దారుణమన్నారు. ఇటీవల కాలంలో నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను కూడా యాజమాన్యం తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యలపై స్థానిక ప్రజా ప్రతినిధులు కల్పించుకుని న్యాయం చేయాలన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద భారీ ధర్నా చేపట్టనున్నామని, నిర్వాసితులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నిర్వాసితులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పీతన భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా రేపు ఉండని ప్రాంతాలివే..

కూర్మన్నపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎల్‌వీ నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈఈ బీకే నాయుడు, ఏడీఈ అడబాల పార్థసారథి, ఏఈ రామకృష్ణలు తెలిపారు. ఈ కారణంగా తోకాడ, ఆటోనగర్, ఎల్‌వీనగర్, డ్రైవర్స్ కాలనీ, ఎర్రగెడ్డ కాలనీ, శ్రీనివాసనగర్, శ్రామికనగర్, కుంచుమాంబ కాలనీ, చినగంట్యాడ, టీవీఎన్ కాలనీ, తాబేళ్ల కాలనీ, పైడన్న గార్డెన్స్, దత్తసాయినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సబ్ స్టేషన్ పరిధిలో వైర్లపై వేలాడుతున్న చెట్ల కొమ్మల నరికివేత, ఇతర నిర్వహణ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా హరిజన జగ్గయ్యపాలెం, అయ్యప్పనగర్, ఎస్టీబీఎల్, పోర్టు రోడ్డు, గెయిల్ గేటు పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

గాజువాక: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గాజువాక ప్రాంతంలోని పంతులు గారి మేడ, జోగవానిపాలెం, పాత గాజువాక, నీల్ కమల్ వీధి, హై స్కూల్ రోడ్డు, పెంటయ్యనగర్, కృష్ణానగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

తిరుమల నగర్ కాలనీ అధ్యక్షుడు మృతి



నాగభూషణం (ఫైల్)

కూర్మన్నపాలెం,జూలై 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్ కాలనీ అధ్యక్షుడు గోగులమూడి నాగభూషణం (81) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా నాగభూషణం కాలనీ అధ్యక్షుడిగా ఉంటూ తిరుమలనగర్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కాలనీకి ఎన్నో అవార్డులు రావడం వెనుక ఆయన కృషి ఎంతో ఉందని, నాగభూషణం మృతి తమకు తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతనిధులు పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంత రెడ్డి, రాజు, అప్పల నాయుడు, మహేశ్, తదితరులు ఉన్నారు.

'వీరమల్లు' విజయం కోసం బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, కార్యకర్తలు

పెందుర్తి, .జూలై 23(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రం విజయవంతం కావాలని ఎమ్మెల్యే పంచకర్ల బుధవారం భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరిపల్లిలో సింబా కన్వెన్షన్ నుంచి భారీ సంఖ్యలో జనసేన శ్రేణులు పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, వేపగుంట మీదుగా ఆర్‌ఆర్‌వీపురం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పంచకర్ల స్వయంగా బండి నడిపి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరమల్లు చిత్రానికి వచ్చిన లాభాల్లో కొంత పేదలకు అందజేస్తానని పవన్ అన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెందుర్తి తహశీల్దార్‌గా వెంకటప్పారావు

పెందుర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి తహశీల్దార్‌గా టి.వెంకటప్పారావును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న వెంకటప్పారావుకు ఇటీవల నిర్వహించిన అడహాక్ తహశీల్దార్‌గా పదోన్నతి లభించింది. అడహాక్ పదోన్నతి ద్వారా పెందుర్తి డీటీ సంతోశ్ కిరణ్‌ను పది రోజుల క్రితం ఇక్కడే తహశీల్దార్ పోస్టింగ్ ఇచ్చారు. ఇంతలోనే అతనిని తప్పించి వెంకటప్పారావుకు పోస్టింగ్ ఇవ్వడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందనే ప్రచారం సాగుతోంది.

కేజీబీవీల్లో వినూత్న బోధన

ఎనిమిది నుంచి ఇంటర్ వరకు ప్రతి రోజూ స్లిప్ టెస్టులు

- వారానికి ఐదు రోజులు ఉదయం ఆరు గంటలకే నిర్వహణ
- విద్యాసంవత్సరం ముగిసే వరకు టైమ్‌టేబుల్ అమలు

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): **కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ల్లో వినూత్న విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో నడుస్తున్న కేజీబీవీల్లో స్టడీ అవర్స్‌ను అమలు చేస్తుంటారు. అయితే ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థినులకు వారానికి ఐదు రోజులు స్లిప్ టెస్టులు నిర్వహించే షెడ్యూల్‌ను ఈ నెల 15న ప్రారంభించారు. వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ముగిసే వరకు ఈ షెడ్యూల్‌ను అమలు చేయాలని కేజీబీవీ ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు వచ్చాయి.**


భీమిలి కేజీబీవీలో ఉదయం ఆరు గంటలకు స్లిప్‌టెస్టులు రాస్తున్న విద్యార్థినులు

జిల్లాలో ఆనందపురం, భీమిలి, పద్మనాభంలో కేజీబీవీలు ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి సెక్షన్‌కు 40 మంది చొప్పున బాలికలకు ప్రవేశం కల్పిస్తారు. ఈ ఏడాది ప్రవేశాల ప్రక్రియ పూర్తవడంతో భీమిలిలో ఆరు నుంచి ఇంటర్ వరకు 280 మంది, ఆనందపురం, పద్మనాభంలో 260 మందికి పైగా బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యార్థినులంతా పూర్తిగా చదువుపై దృష్టి సారించే చర్యల్లో భాగంగా స్టడీ అవర్స్, స్లిప్ టెస్టుల నిర్వహణ చేపట్టాలని కేజీబీవీ డైరెక్టర్ దేవానందరెడ్డి ఇటీవల షెడ్యూల్ జారీ చేశారు. ఇందులో భాగంగా రాత్రి పది గంటల వరకు స్టడీ అవర్స్ అమలుచేయాలని పేర్కొన్నారు. దీనికి 'విజయపథం' అని పేరు పెట్టారు. ఆ మరుసటి రోజు ఉదయం 5 గంటలకు తిరిగి స్టడీ అవర్‌ను ప్రారంభించి ఆరు గంటలకు స్లిప్ టెస్టు నిర్వహించాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు దీనిని ఈ నెల 15వ తేదీ నుంచి అమలులోకి తెచ్చారు. ఆరు, ఏడు తరగతులకు రోజు విడిచి రోజు స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. ఎనిమిది నుంచి ఇంటర్ వరకు మంగళవారం నుంచి శనివారం వరకు రోజూ టెస్టులు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతిరోజూ తెల్లవారుజామున స్టడీ అవర్, స్లిప్ టెస్టులను విద్యాలయం ఆవరణలోనే విద్యార్థినులంతా కింద కూర్చుని పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు. తరగతి గదుల్లో కాకుండా ఆరుబయట చల్లని, ఆహ్లాదకరమైన వాతావరణంలో స్టడీ అవర్, స్లిప్ టెస్టులను నిర్వహించడం వల్ల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కాగా మంగళవారం నుంచి ఉదయం పూట ఆరుబయట నిర్వహించే స్లిప్ టెస్టులకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా నెటిజన్ల నుంచి మంచి స్పందన లభించింది.

రేపటి నుంచి శ్రావణ మాస వేడుకలు

- ముస్తాబవుతున్న కనకమహాలక్ష్మి ఆలయం

మహారాణిపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నుంచి శ్రావణ మాసం వేడుకలు నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 7.30 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించనున్నారు. శ్రావణమాసంలో ప్రతి రోజు శ్రావణ లక్ష్మి ప్రత్యేక కుంకుమ పూజలు, మహాలక్ష్మి హోమాలు నిర్వహించనున్నారు ప్రతి గురు, శుక్రవారాల్లో లక్ష్మీ హోమం, ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతం, 9న శ్రావణ పౌర్ణమి పూజలు చేస్తారు. సెప్టెంబరు 23న మహా పూర్ణాహుతితో వేడుకలు ముగుస్తాయి.

పోర్టును సందర్శించిన ట్రైనీ ఐపీఎస్ అధికారులు


విశాఖపట్నం పోర్టులో ట్రైనీ ఐపీఎస్ అధికారుల బృందం

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాలకు చెందిన 28 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారుల బృందం బుధవారం విశాఖపట్నం పోర్టును సందర్శించింది. సముద్ర భద్రతలో ఎదురయ్యే ఆధునిక సవాళ్లపై వారికి అవగాహన కల్పించారు. పోర్టులో కార్యకలాపాలు, అభివృద్ధి పనులపై వివరించారు. పోర్టు డిప్యూటీ కన్జర్వేటర్, పోర్టు ఫెసిలిటీ సెక్యూరిటీ ఆఫీసర్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు పోర్టు భద్రతపై వివరించారు. మౌలిక సదుపాయాలు, కార్గో హ్యాండ్లింగ్, ఆధునికీకరణ, యాంత్రీకరణ, కవర్డ్ స్టోరేజీ, సోలార్ పవర్ ఉత్పత్తి వంటి అంశాలను ట్రైనీ ఐపీఎస్‌లు తెలుసుకున్నారు.

సంపూర్ణ అక్షరాస్యతకు అక్షరాంధ్ర: కలెక్టర్

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి అక్షరాంధ్ర అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ వెల్లడించారు. అక్షరాంధ్ర జిల్లా కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమంలో జిల్లాలో 15 ఏళ్ల నుంచి 59 సంవత్సరాల మధ్య 78,676 మంది వయోజనులకు గుర్తించామన్నారు. వీరందరినీ వచ్చే ఏడాది మార్చి లోగా అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. 2029 నాటికి 100 శాతం అక్షరాస్యత సాధించే జిల్లాగా మారుస్తామన్నారు. ప్రతి పదిమందికి ఒక వలంటీర్ టీచర్‌ను నియమించాలని వీరికి అంగన్‌వాడీ, కమ్యూనిటీ కేంద్రాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. 15 గంటలు ఆడియో విజువల్స్ 40 గంటలు క్లాస్‌రూమ్ తరగతులు, 45 గంటలు అభ్యసన కార్యక్రమాలు అమలుచేయాలన్నారు. గ్రామీణ మండలాల్లో జడ్పీ సీఈవో, ఎంపీడీవోలు, నగరంలో జోనల్ కమిషనర్లు, యూసీడీ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం అమలుచేయాలన్నారు. గ్రామ, వార్డుస్థాయిలో వలంటీర్ టీచర్లను ఎంపిక చేసే బాధ్యత డీఆర్డీఏ, యూసీడీ పీడీలు చూసుకోవాలన్నారు. తరగతులకు హాజరై విద్యావంతులైన వారికి మార్చిలో సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. సమావేశంలో వయోజన విద్య ఉపసంచాలకులు సుబ్రహ్మణ్యం వర్మ, యూసీడీ పీడీ సత్యవాణి, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి, సమాచార శాఖ డీడీ సదారావు, విద్యాశాఖ ఏడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించిన జీవీఎంసీ కమిషనర్

వెంకోజీపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావులతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి అన్ని విభాగాల ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను మూడు రోజుల్లో పరిష్కరించాలన్నారు. అడ్మిన్ కార్యదర్శులు పరిష్కరించాల్సినవి గత 30 రోజులుగా వారి లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆయా విభాగాధిపతులు వాటిపై సత్వరం చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ప్రధాన ఇంజనీరు పల్లంరాజు, ప్రధాన వైద్యాధికారి ఈఎన్‌వీ నరేశ్‌కుమార్, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్‌రావు, పీడీ-యూసీడీ పీఎం సత్యవేణి, డీసీఆర్ శ్రీనివాసరావులను ఆదేశించారు. ఫిర్యాదుదారుని సంప్రదించి, ఫీల్డ్ విజిట్ చేసిన అనంతరం విజిట్ చేసిన ఫొటోను అప్‌లోడ్ చేస్తూ సర్వీస్‌ను పూర్తి చేసినట్టు ఎండార్స్‌మెంట్ ఫిర్యాదుదారునికి అందజేయాలన్నారు. సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులు, ఇతర కార్యదర్శులు ఫీల్డ్‌కు వెళ్లడం లేదని, సచివాలయాల్లో కనిపించడం లేదని, ఫీల్డ్ విజిట్‌కి వెళ్తే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. వార్డు కార్యదర్శులంతా సచివాలయాల్లో తప్పనిసరిగా మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విధి నిర్వహణలో ప్రజలకు సేవలందించాలని కమిషనర్ ఆదేశించారు. అడ్మిన్ కార్యదర్శులు పర్మిషన్ లేదా సెలవుపై వెళ్లాలంటే జోనల్ కమిషనర్‌కు తెలియపరచాలన్నారు. సచివాలయాల వారీగా రోజుకు ఒకటి లేదా రెండు వినతులు వస్తాయని, వాటిని క్రమశిక్షణతో పూర్తిచేస్తే పెండింగ్‌లో ఉండవన్నారు. తెలిపారు. చాలామంది ప్లానింగ్ కార్యదర్శులు ఇతర చోట్ల పని చేస్తున్నారని, దీంతో సమస్యలు ఎదురవుతున్నాయని జోనల్ కమిషనర్లు వివరించగా, అలాంటి వారి జాబితాను అందించాలన్నారు. పురమిత్ర యాప్‌ను వినియోగించుకోవాలని, దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సచివాలయ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు.


మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

విమానాశ్రయంలో ఉచిత వైఫై సేవలు ప్రారంభం

గోపాలపట్నం, జూలై 23(ఆంధ్రజ్యోతి): విశాఖఅంతర్జాతీయవిమానాశ్రయంలో ఉచిత వైఫై సేవలను బుధవారం విమానాశ్రయ డైరెక్టర్ ఎన్.పురుషోత్తమ్ ప్రారంభించారు. దేశంలో లాభార్జనలో ఉన్న 20 ముఖ్య విమానాశ్రయాల్లో విశాఖ స్థానం సంపాదించిందన్నారు. ప్రతిరోజు దేశ, విదేశాలకు 44 విమానాల్లో వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని, వీరికి మెరుగైన సౌకర్యాల్లో భాగంగా ఉచిత వైఫై సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. సేవలు అందిస్తున్న యాక్ట్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. యాక్ట్ ఫైబర్ నెట్ వైస్ ప్రెసిడెంట్ సచిన్ రోషన్‌లాల్ మాట్లాడుతూ ప్రయాణికులు మొబైల్ నంబర్‌తో ఓటీపీ ద్వారా వైఫై సేవలు గంట సేపు ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ డీజీఎం ఆర్.భాస్కరరావు, ఐటీ విభాగ సహాయ ఇంజనీర్ సీహెచ్‌వీవీ గణేశ్వరరావు, యాక్ట్ సంస్థ మేనేజర్ ప్రసాదరెడ్డి, విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు.


వైఫై సేవలు ప్రారంభిస్తున్న దృశ్యం

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో సమష్టిగా నిలవాలి

వైసీపీ కార్పొరేటర్లతో ఎమ్మెల్సీ బొత్స

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల ఆరున జరిగే జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో వైసీపీ కార్పొరేటర్లంతా సమష్టిగా నిలబడి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆదేశించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై వైసీపీ కార్పొరేటర్లతో మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్ తదితరుల కార్పొరేటర్ల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎన్నికలో పోటీచేయాలని భావించే వారి పేర్లను ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావుకు ఇవ్వాలన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాస తీర్మానం సందర్భంగా పార్టీ విప్‌ను ఉల్లంఘించిన 27 మంది కార్పొరేటర్లపై అనర్హత వేటు వేసే అవకాశం ఉందని, అది తమ విజయానికి దోహదపడుతుందని బొత్స అన్నారు. కార్పొరేటర్లపై చర్యలకు హైకోర్టు ఇచ్చిన గడువు 21తో ముగిసినందున, గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వాలని, అప్పటికీ స్పందించకుంటే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేద్దామని నేతలు అభిప్రాయపడినట్టు సమాచారం. సమావేశంలో మొల్లి అప్పారావు, గొలగాని శ్రీనివాసరావు, కట్టుమూరి సతీష్, చింతలపూడి వెంకటరామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

దేవుడి పేరుతో వ్యాపారం ఆపాల్సిందే

- కల్యాణోత్సవానికి అందరినీ ఉచితంగా అనుమతించాలి
- లేదంటే అడ్డుకుంటాం
- ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి


అయోధ్య నమూనా ఆలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసానంద

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పార్క్ హోటల్ పక్కన ఖాళీ స్థలంలో అయోధ్య రామాలయం సెట్ వేసి, బాలరాముడి దర్శనాలు చేయిస్తున్న కమిటీని తాము అభినందిస్తున్నామని, కానీ ఆ పేరుతో టికెట్లు విక్రయించడాన్ని ఖండిస్తున్నామని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. భద్రాచలం ఆస్థాన పండితులతో కల్యాణోత్సవం అంటూ రూ.2,999కు టికెట్లు విక్రయించడంపై రెండు రోజులుగా వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన హిందూ సంఘాలు, సాధు పరిషత్ సభ్యులు ఆలయ నమూనాను బుధవారం సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఆలయ నమూనాలు పెట్టి డబ్బులు సంపాదించడం వ్యాపారంగా మారిందని ఆరోపించారు. భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పించాలని డిమాండ్ చేశారు. అయోధ్య రామాలయంలోనే దర్శనానికి టికెట్ లేదని, ఇక్కడ ఎలా పెడతారని ప్రశ్నించారు. ఈ నెల 29న కల్యాణోత్సవం బహిరంగంగా నిర్వహించాలని, అందరినీ ఉచితంగా అనుమతించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా టికెట్లు పెట్టి, వీఐపీలకు ప్రత్యేకం అంటే అడ్డుకుంటామని ప్రకటించారు. హిందూ పరిషత్ ప్రతినిధి తురగా శ్రీరామ్ మాట్లాడుతూ ఆలయ నమూనా ఏర్పాటు చేసి 45 రోజులు దాటిందని, ఇప్పటివరకు ఎన్ని లక్షల మంది దర్శించుకున్నారో, ఎన్ని కోట్లు వసూలయ్యాయో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీనికి అనుమతి ఇచ్చిన అన్ని శాఖలు విచారణ చేయాలన్నారు. ప్రదర్శన నిర్వహించడానికి గడువు పెంచారని, ఎవరు చెబితే ఇవన్నీ చేస్తున్నారో బయట పెట్టాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా విశాఖ నుంచి ఎన్నికైన పీవీఎన్ మాధవ్ దీనిపై తక్షణమే ఓ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇలాంటి ఆలయ నమూనా వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.

క్రైం... crime news

ఉక్కు ఉద్యోగి ఆత్మహత్య


శ్రీనివాసులు (ఫైల్)

కూర్మన్నపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు తల్లి మృతి చెందిందన్న బాధ. మరోవైపు విధుల నుంచి తొలగించారన్న మనస్తాపంతో ఉక్కు ఉద్యోగి ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 87వ వార్డు పరిధి కణితి కాళింగుల వీధిలో బొడ్డ శ్రీనివాసులు (39) తండ్రి అప్పలరాజుతో నివాసం ఉంటున్నారు. సుమారు ఆరు నెలల క్రితం తల్లి మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు గురైన శ్రీనివాసులు సరిగ్గా విధులకు వెళ్లడం లేదు. దీంతో స్టీల్ ప్లాంట్ యాజమాన్యం పలుమార్లు నోటీసులు పంపినా ఆయన నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఇటీవల విధుల నుంచి తొలగించారు. తల్లి లేదన్న బాధతో పాటు ఉద్యోగం పోవడం, పెళ్లి కూడా కాకపోవడంతో మంగళవారం రాత్రి తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాసులు తన రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అర్ధరాత్రి సమయంలో కుమారుడి రూమ్ వద్దకు వెళ్లి ఎంతసేపు పిలిచినా తలుపులు తెరవకపోవడంతో తండ్రి ఆందోళనకు గురయ్యారు. దీంతో చుట్టుపక్కల వారి సహాయంతో బలవంతంగా తలుపులను పగులగొట్టి చూడగా ఉరి వేసుకుని ఉన్న కుమారుడి మృతదేహాన్ని చూసి ఆయన కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పలరాజు ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కడవరకూ తోడుంటాడనుకున్న కొడుకు తనను ఒంటరిని చేసి కానరాని లోకాలకు పోయాడంటూ అప్పలరాజు రోదన అక్కడివారిని కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఎంవీపీ కాలనీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న కలాసీల వద్ద నగదు, సెల్‌ఫోన్ చోరీ చేసిన ఘటనలో నిందితుడిని ఎంవీపీ పోలీసులు అరెస్టు చేశారు. ద్వారకా జోన్ సీఐ చక్రధరరావు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 19న రాత్రి మద్దిలపాలెం ఆర్టీసీ డిపో పార్సిల్ కౌంటర్ వద్ద కలాసీ చిటికిల చెల్లనాయుడు నిద్రిస్తుండగా అతడి వద్దనున్న సెల్‌ఫోన్, రూ.19,300 నగదు, మరో కలాసీ వద్ద మొబైల్ ఫోన్ చోరీకి గురయ్యాయి. దీనిపై ఫిర్యాదు అందుకున్న ఎంవీపీ పోలీసులు దర్యాప్తులో ఆరిలోవకు చెందిన కట్టమ్మరెడ్డి విజయ్‌కుమార్ (22)ను నిందితుడిగా గుర్తించారు. కేఆర్ఎం కాలనీలో సెల్‌ఫోన్ విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.17,300 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన నేవీ ప్రతినిధుల సింగపూర్ పర్యటన


యుద్ధ నౌకపై భారత్, సింగపూర్ నేవీ ప్రతినిధులు

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం సింగపూర్ పర్యటన విజయవంతంగా ముగిసింది. ఆగ్నేయ ఆసియాలో ఆపరేషన్లను విస్తృతం చేయడానికి ఈ నెల 16న రియర్ అడ్మిరల్ సుశీల్ మీనన్ సారథ్యంలో యుద్ధనౌకలు ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ శక్తి, ఐఎన్ఎస్ సాత్పుర, ఐఎన్ఎస్ కిల్తాన్‌లు విశాఖపట్నం నుంచి బయలుదేరి సింగపూర్ వెళ్లాయి. సింగపూర్ నేవీ ఫ్లీట్ కమాండర్‌తో తూర్పు నౌకాదళం ప్రతినిధులు ద్వైపాక్షిక సంబంధాల మెరుగుపై చర్చించారు. ప్రాంతీయ అభివృద్ధి, తీర ప్రాంత రక్షణకు కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఈ నెల 19న పర్యటన ముగించుకొని తిరిగి తూర్పు నౌకాదళానికి చేరుకున్నారు.

పారిశ్రామిక సంస్థల్లో ఎన్ఎస్‌జీ మాక్ డ్రిల్


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్ఎస్‌జీ కమెండోలు

విశాఖపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పారిశ్రామిక సంస్థల్లో ఉగ్రవాద దాడులు జరిగితే వాటిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై జాతీయ భద్రత దళం (ఎన్ఎస్‌జీ) పలు సంస్థల్లో మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ నెల 21న ప్రారంభమైన కార్యక్రమం 24 వరకు జరుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. పోర్టు, భారత వ్యూహాత్మక చమురు నిల్వల కేంద్రం, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ తదితర సంస్థల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఊహించని విపత్కర పరిస్థితులు ఎదురైనపుడు ఎలా స్పందించాలి? ఒకరికొకరు సహకరించుకోవడం, బాధితులను రక్షించడం వంటి అంశాలను ప్రదర్శించారు. వీటిని రాష్ట్ర పరిపాలన విభాగం సమన్వయం చేయగా, ఏపీ పోలీస్‌కు చెందిన ఆక్టోపస్, విశాఖ ట్రాఫిక్ పోలీసులు, అగ్నిమాపక దళాలు, వైద్య బృందాలు పాల్గొన్నాయి.